

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

టీడీపీకి వేమిరెడ్డి దంపతుల రూ.5 కోట్ల విరాళం

నెల్లూరు, మే27, ప్రభాతవార్త-వైద్యం హైబ్రిడ్ విధానంలో అట్టహాసంగా ప్రారంభమైన తెలుగుదేశం పార్టీ ˘మహానాడు్మలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు తమ ఉదారతను చాటుకున్నారు. నెల్లూరు జిల్లాలో పార్టీని క్లీన్ స్వీప్ (10కి 10 సీట్లు) దిశగా నడిపించడంలో కీలక భూమిక పోషించిన వేమిరెడ్డి దంపతులు, పార్టీ పట్ల తమకున్న అంకితభావాన్ని మరోసారి నిరూపించుకున్నారు. బుధవారం మహానాడు మొదటి రోజున తెలుగుదేశం పార్టీ నిధికి వీరు రూ.5 కోట్ల భారీ విరాళాన్ని అందజేసి తమ ప్రత్యేకతను చాటుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు మరియు ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు గారు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారికి మరియు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



నెల్లూరు కలెక్టరేట్, మే 27, ప్రభాతవార్త జిల్లాలో 2026 ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. బుధవారం ఉదయం కలెక్టర్ చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి సంబంధించిన పూర్తి షెడ్యూల్, విధివిధానాలను వివరించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లాలో చేపట్టనున్న కార్యక్రమాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితాలను క్షుణ్ణంగా నవీకరించడం, ధ్రువీకరించడం, తప్పులను సరిదిద్దడం లక్ష్యంగా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఎటువంటి పొరపాట్లు లేకుండా పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీలు, బూత్ లెవల్ ఏజెంట్లు చురుకుగా సహకరించాలని కోరారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం జూన్ 5 నుంచి 14 వరకు సన్నాహక కార్యక్రమాలు, శిక్షణ, ఫారంల ముద్రణ వంటి పనులు నిర్వహించనున్నట్లు చెప్పారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల వివరాలను పరిశీలిస్తారని తెలిపారు. అదే సమయంలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. జూలై 21న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు, అదే రోజు నుంచి ఆగస్టు 20 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. అనంతరం జూలై 21 నుంచి సెప్టెంబర్ 18 వరకు అభ్యంతరాల పరిశీలన, పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితాను అధికారికంగా విడుదల చేస్తామని కలెక్టర్ వెల్లడించారు. దేశ వ్యాప్తంగా ఒక వ్యక్తికి ఒకే ఓటు హక్కు ఉండేలా చూడడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, స్వచ్ఛమైన ఓటరు జాబితా సిద్ధం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు, వారి ప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంగం,సిద్దీపురం లో కోలహలంగా మహానాడు వేడుకలు

రెండు క్లష్టర్లలో పాల్గోన్న దేవాదాయశాఖ మంత్రి ఆనం

సంగం మే 27 ప్రభాతవార్త మండలంలోని సిద్దీపురం,సంగం గ్రామాలలో కోలహలంగా మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మొదట సిద్దీపురం గ్రామంలో ఏర్పాటు చేసిన మహానాడు వేదిక వద్దకు వచ్చి ఎన్‌టిఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పార్టీ జెండాను ఎగుర వేశారు.అనంతరం కైవల్యారెడ్డి, ఆనం రంగమయూరిరెడ్డితో కలిసి మహానాడును లైవ్‌లో వీక్షించారు. ఈకార్యక్రమంలో కిమ్స్ డైరక్టర్ తాళ్లూరు గిరినాయుడు, సీనియర్‌నాయకులు సూరా శ్రీనివాసులురెడ్డి,ఆనం ప్రసాద్‌రెడ్డి, మెట్టు విజయకృష్ణారెడ్డి, బండా హరికిషోర్‌రెడ్డి,పొనకా హజరత్‌రెడ్డి జెండాదిబ్బనాయకులు పర్వతాల వెంకటరత్నం, యువత నాయకులు నెల్లూరు పెంచలయ్య, కంచర్ల నారాయణనాయుడు,కంచర్ల నరేష్‌నాయుడు, పగడాల రఘురామయ్య ,హరిరెడ్డి,జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గోన్నారు. అనంతరం మంత్రి సంగం క్లష్టర్‌లో జరుగుతున్న కార్యక్రమంలో పాల్గోన్నారు.మహానాడు కార్యక్రమాన్ని లైవ్‌లో వీక్షించా రు.నాయకులతో కొద్దిపేపు ముచ్చటించారు. ఈకార్యక్రమంలో సీనియర్‌నాయకులు మండల పార్టీ అధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి, కర్నాటి రవీంద్రరెడ్డి, బాబు, గునుపూడి గిరి, పలువురు టిడిపినాయకులు కార్యకర్తలు పాల్గోన్నారు.

మత్స్యకారుల మృతిపై మంత్రి నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి

- బాధిత మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- మంత్రినారాయణ
- నెల్లూరులో సముద్రపు ఈదురు గాలుల బీభత్సం
- ఇద్దరు మత్స్యకారులు దుర్మరణం

నెల్లూరు, మే27, ప్రభాతవార్త - వైద్యం నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలో జరిగిన పడవ ప్రమాదంపై రాష్ట్ర మంత్రి నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బోగోలు మండలం తాటిచట్లపాలెం తీరంలో బోటు బోల్తా పడి ఇద్దరు మత్స్యకారులు మృతి చెందిన ఘటనపై ఆయన వెంటనే స్పందించారు. ప్రమాద వివరాలను స్థానిక కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డితో పాటు సంబంధిత అధికారులతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి ఆరా తీశారు. సముద్రంలో వేటకు వెళ్లి ప్రాణాలు కోల్పోయిన తూపిలి బాల మురళి, కుమారి గోవిందు కుటుంబాలకు మంత్రి నారాయణ తన తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ఈ కష్టసమయంలో ప్రభుత్వం మత్స్యకార కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటుందని, బాధిత కుటుంబాలను ఆదుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

మత్స్యకారుల మృతిపై ఎంపీ వేమిరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి

నెల్లూరు, మే 27, ప్రభాతవార్త - వైద్యం నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలో సముద్ర తీరంలో జరిగిన పడవ ప్రమాదంపై నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బోగోలు మండలం తాటిచెట్లపాలెం సముద్ర తీరంలో బోటు బోల్తా పడి ఇద్దరు మత్స్యకారులు మృతి చెందిన ఘటనపై ఆయన స్పందించారు. ప్రమాద వివరాలను సంబంధిత అధికారులతో ఎంపీ ఫోన్‌లో మాట్లాడి ఆరా తీశారు. సముద్రంలో వేటకు వెళ్లి ప్రాణాలు కోల్పోయిన తూపిలి బాల మురళి, కుమారి గోవిందు కుటుంబాలకు ఎంపీ వేమిరెడ్డి తన తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ఈ కష్ట సమయంలో ప్రభుత్వం మత్స్యకార కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటుందని, బాధిత కుటుంబాలను ఆదుకుంటామని వారికి ఎంపీ భరోసా ఇచ్చారు.

జిల్లాలో ఏన్యూమరేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయండి

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు కలెక్టరేట్, మే 27, ప్రభాతవార్త ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన జనగణన కార్యక్రమాన్ని కచ్చితత్వంతో, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల నెల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని 27 వార్డు, ఆమంచర్ల, పొదలకూరులోని విజ్ఞేశ్వరపురం 2 తదితర ప్రాంతాలలో పర్యటించి క్షేత్రస్థాయిలో జన గణన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ జన గణన ప్రక్రియలో 2011 సంవత్సరంలో తీసిన జనగణన కన్నా నేడు కొన్ని ప్రాంతాలలో జనాభా లెక్కలలో తేడా వచ్చిందని దాన్ని సవరించే విధంగా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారన్నారు. గణన జరిగేటప్పుడు కొంతమంది ఇంటికి తాళం వేసి ఉండడం లేదా పనికి వెళ్లడం లేదా వలసపై ఉండడం అయిందని అటువంటి వాటిని మరలా పరిశీలించి సమగ్రంగా నివేదిక రూపొందించాలన్నారు. మూడు నాలుగు రోజులలో జనాభా సవరణ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉందని ఆయన తెలిపారు. అదేవిధంగా క్షేత్రస్థాయిలో ప్రోగ్రామ్‌ని పరిశీలించడం జరిగిందని 2002 నాటి ఎలక్ట్రోరల్ రోల్‌ను సవరించే విధంగా ప్రత్యేక డ్రైవలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 15 జూన్ నుండి జూలై 14, 2026 వరకు బూతులెవల్ ఆఫీసర్లు ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితాను తయారు చేయడం జరుగుతుందని జూన్ 15 తర్వాత ఒక నెల రోజుల పాటు జాబితాలో సవరణలకు గాని కొత్తవి పొందుపరచుటకు గాని అవకాశం ఏర్పడుతుందని అనంతరం తుది డ్రాఫ్ట్ జాబితాను సెప్టెంబర్ 22, 2026న ముద్రించడం జరుగుతుందన్నారు. అనంతరం పొదాలకూరు బిట్ 2 గ్రామ సచివాలయంలో సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలు గురించి, ఇతర అంశంల గురించి చర్చించి ఎనీమిషన్, ప్రోగ్రాం పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి నాగ సంతోష్ అనూష, మండల రెవెన్యూ అధికారులు కృష్ణ ప్రసాద్, శివకృష్ణ మండల పరిషత్ అధికారులు, ఎన్యూమరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహానాడుకు విశేష స్పందన

- నూతనోస్తాహంలో తమ్ముళ్లు
- సిటీ నియోజకవర్గంలో పండుగలా మహానాడు
- పసుపు మయంగా మారిన నగర వీధులు
- 14 క్లష్టర్లలో నిర్వహించిన మహానాడులో పాల్గొన్న మంత్రి

నెల్లూరు, మే27, ప్రభాతవార్త-వైద్యం చరిత్రలో నిలిచిపోయేలా నెల్లూరులో మహానాడు నిర్వహించాలని భావించామని, పశ్చిమాసిలో యుద్ధం వల్ల ఇంధన పొదుపులో భాగంగా భారత ప్రధాని మోడీ పిలుపుతో టీడీపీఅధినేత చంద్రబాబు నెల్లూరులో నిర్వహించాల్సి న మహానాడును రద్దు చేశారని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. వర్చువల్‌మహానాడు నిర్వహించాలని అసాధారణ నిర్ణయం తీసుకున్నారన్నారు. రికార్డు స్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా 1875 క్లస్టర్లలో నిర్వహించిన హైబ్రిడ్ మహానాడుకు విశేష స్పందన వచ్చిందన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశంతో నెల్లూరు సిటీలోని 14 క్లస్టర్లలో వర్చువల్ మహానాడును పండుగలా నిర్వహించారు. 53వ డివిజన్ లో నిర్వహించిన మహానాడులో మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పార్టీ అబ్జర్వర్ గురవారెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ముఖ్య అతిథులుగా పాల్గొని జెండా ఆవిష్కరించారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి మహానాడు కార్యక్రమాన్ని ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి మహానాడు కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, ఇతర అగ్రనేతల ఉపన్యాసాలను శ్రద్ధగా ఆలకించారు. మహానాడులో చర్చించాల్సి న అంశాలపై క్లస్టర్ పరిధిలోని నేతలు, కార్యకర్తలకు మంత్రి నారాయణ దిశానిర్ధేశం చేశారు. అనంతరం మంత్రి మిగిలిన 13 క్లస్టర్లలో జరుగుతున్న మహానాడు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ క్యాడర్‌లో నూతనోత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. సిటీలో 14 క్లస్టర్లలో మహానాడు వేడుక పండుగ వాతావరణంలో జరుగుతోందన్నారు. కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు రెట్టింపు ఉత్సాహంతో పాల్గొన్నారని తెలిపారు. సుపరిపాలన కోసం 1983లో మహానాడుకు స్వర్గీయ ఎన్టీఆర్ పురుడుపోశారన్నారు. మహానాడులో చేసిన అభివృద్ధిపై చర్చించి, ప్రజా సమస్యలపై తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. మహోన్నత ఆశయంతో 44 ఏళ్లుగా నిర్వహిస్తున్న మహానాడుకు ఆదరణ పెరుగుతోందని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివెళ్లిందని, అస్తవ్యస్థ పాలనతో వ్యవస్థలని సర్వనాశనం చేసిందని, నిధులను దారి మళ్లించి గందరగోళం సృష్టించిందని ఆరోపించారు. సీఎం చంద్రబాబు అపార అనుభవంతో పరిస్థితి చక్కబడుతోందని, పరిశ్రమల స్థాపనతో సంపద సృష్టించేందుకు యువనేత లోకేష్ శ్రమిస్తున్నారని, దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి రాబట్టగలిగారని కొనియాడారు. పరిశ్రమలు పూర్తయితే లక్షలాది మందికి ఉపాధి దొరుకుతుందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని, తెలుగుదేశం పార్టీ తోనే అది సాధ్యమన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలే టీడీపీకి బలమని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు, యువనేత లోకేష్ అలుపెరగని కృషి చేస్తున్నారన్నారు. పరిశ్రమల స్థాపనకు పునాదులు వేస్తున్నారని, ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తున్నారని తెలిపారు. ఈజ్ ఆఫ్ దూయింగ్ ని స్పీడ్ ఆఫ్ దూయింగ్ చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. పార్లమెంట్ పరిధిలో 82 క్లస్టర్లలో మహానాడు పండుగలా జరుగుతోందని, కార్యకర్తల్లో ఉత్సాహం వెల్లివిరిసిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్‌రూప్‌కుమార్‌యాదవ్,తహసీన్ ఇంతియాజ్, రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ,మాజీజడ్పీటీసీ విజేతారెడ్డి,నగర పార్టీ అధ్యక్షులు మామిదాలమధు,డివిజన్ కార్పొరేటర్లు, టీడీపీ ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వర్చువల్ గా క్లస్టర్ల వారిగా ప్రారంభమైన మహానాడు కార్యక్రమం



కోవూరు, మే27 ప్రభాతవార్త : కోవూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జరుగుతున్న కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎన్టీఆర్ విగ్రహానికిపూలమాల మాలవేసి నివాళులర్పించిన ఎంపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన డిజిటల్ మహానాడు కార్యక్రమాన్ని స్థానిక నాయకులతో కలిసి లైవ్‌లో వీక్షించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇంధనాన్ని పొదుపు చేయాలని ప్రధానమంత్రి మోడీ పిలుపుమేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహానాడు ను వర్చువల్గా నిర్వహిస్తున్నారు రాష్ట్ర వ్యాప్తంగా 1875 క్లస్టర్లలో మహానాడు కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నాం నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గంలో 82 క్లస్టర్లలో పండగ వాతావరణంలో మహానాడు కార్యక్రమం జరుగుతుంది కస్టర్లు పెట్టి ఈ విధంగా చేయడం నారా లోకేష్ ఆలోచన ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలి జిల్లాలో భారీపరిశ్రమలు రాబోతున్నాయి పరిశ్రమల వల్ల యువతకు లక్షలాది ఉద్యోగాలు ఉపాధి రానుంది

ముస్లిం సోదరులందరికీ బక్రీద్ శుభాకాంక్షలు

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు కలెక్టరేట్, మే 27, ప్రభాతవార్త జిల్లాలోని ముస్లిం సోదరులందరికీ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. దానధర్మాలకు, త్యాగాలకు ప్రతీకగా నిలిచే పండుగల్లో బక్రీద్ పండుగకు ప్రత్యేక స్థానం ఉందని, జిల్లాలోని ముస్లింలందరూ భక్తి శ్రద్ధలతో ఆనందంగా బక్రీద్ పండగ జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరిపై ఆ అల్లా ఆశీస్సులు మెండుగా ఉండి అందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆకాంక్షించారు.

బుచ్చిలో అట్టహాసంగా మహానాడు వేడుకలు

ఎన్‌టిఆర్ విగ్రహానికి మాలదారణ చేసిన ఎంపి వేమిరెడ్డి

బుచ్చి మే 27 ప్రభావార్త బుచ్చిరెడ్డిపాళెంలో మహానాడు మూడు క్లష్టర్లలలో అట్టహాసంగా ప్రారంభం అయింది. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాలతో టిడిపి నాయకులు ఉత్సహంగా మహానాడు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గోన్నారు. మొట్టమొదట బుచ్చిరెడ్డిపాళెం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహానాడు కార్యక్రమంలో ఆయన పాల్గోని దివంగత నేత ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు,కార్యకర్తలతో కలిసి కూర్చొని అమరావతి మహానాడు లైవ్‌ను తిలకించారు.

ఎంపి వేమిరెడ్డి మాట్లాడుతు ఇంధనాన్ని పొదుపు చేయాలని ప్రధానమంత్రి మోడీ పిలుపు మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహానాడును వర్చువల్గా నిర్వహించారని ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1857 క్లష్టర్లలలో మహానాడు కార్యక్రమంలో ఘనంగా నిర్వహించడం జరిగిందని అన్నారు. నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గంలో 82 క్లష్టర్లలలో పచ్చపండుగ వాతావరణం నెలకొందని ఆయన కొనియాడారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలని అన్నారు. ఈక్లష్టర్ ఇంచార్జిగా వింజం రామానాయుడు వ్యవహారించారు. ఈకార్యక్రమంలో మొదట పార్టీ జెండాను ఎగుర వేశారు.ఈకార్యక్రమంలో టౌన్ గౌరవాధ్యక్షులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి, టౌన్ పార్టీ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు,చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా,మురళీ,వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి,వైస్ చైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్,పఠాన్ మహబూబాషా, కౌన్సిలర్లు రహమత్, సూరా శ్రీనివాసులురెడ్డి, నాయకులు వింజం మహేష్‌నాయుడు, దళితనాయకులు ఉసురుపాటి ప్రసాద్, మైనార్టీనాయకులు షబ్బీర్, ఫర్వీనా, తదితరులు పాల్గోన్నారు. అనంతరం ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కె వి ఆర్ కళ్యాణ మండపంలో జరుగుతున్న రూరల్ క్లష్టర్‌ని పరిశీలించారు.ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏటూరు శివరామకృష్ణారెడ్డి, రూరల్ అధ్యక్షులు జగదీష్, నాయకులు శేషయ్య,ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు, నాగమాంబపురం నాయకులు వల్లూరు రాఘవరెడ్డి, తమ్మిరెడ్డిమల్లికార్జున, రైతు విభాగం నాయకులు అమర్‌నాద్‌రెడ్డి పాల్గోన్నారు.అనంతరం క్లష్టర్ 2 పరిధిలో ఎస్ఎస్ కళ్యాణ మండపంలో జరుగుతున్న మహానాడు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు యర్రంరెడ్డి గోవర్దన్‌రెడ్డి,కోడూరు కమలాకర్‌రెడ్డి , పవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ, పార్లమెంటరీ ఉపాధ్యాక్షులు ఎంవి శేషయ్య, సీనియర్ నాయకులు పుట్టా సుబ్రమణ్యంనాయుడు,క్లష్టర్ ఇంచార్జి ఇప్పగుంట సుధాకర్‌రెడ్డి,మహిళా నాయకులు పుట్టా లక్ష్మీకాంతమ్మ ,కోటంరెడ్డి లలితారెడ్డి, తాళ్ళ వైష్ణవి, శ్రీదేవి ,దశరద్,వల్లూరు శ్రీనివాసులు, దుగ్గిశెట్టి హరినాద్,తాళ్ళ నరసింహస్వామి, టిడిపినాయకులు కార్యకర్తలు పాల్గోన్నారు.

పండుగ వాతావరణంలో నెల్లూరు రూరల్ మహానాడు

నెల్లూరు రూరల్ మే 27 ప్రభాతవార్త: నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమం పండుగ వాతావరణాన్ని తలపిస్తూ అత్యంత కోలాహలంగా నిర్వహించబడింది. రాష్ట్రవ్యాప్తంగా హైబ్రీడ్ విధానంలో క్లస్టర్‌ల వారీగా జరిగిన మహానాడు కార్యక్రమంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని క్లస్టర్-2, క్లస్టర్-3 మరియు క్లస్టర్-11 కేంద్రాలలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హాజరై పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహానాడు స్ఫూర్తితో ఇదే ఉత్సాహాన్ని కొనసాగిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగుతామని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రజలకు మంచి పరిపాలన అందిస్తున్న చక్కటి ప్రభుత్వం అధికారంలో ఉందని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి ఫలాలు భావితరాలకు చేరాలంటే కూటమి ప్రభుత్వం మరో పదేళ్లు అధికారంలో కొనసాగాల్సి న అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా దూసుకుపోతుందని, యువనేత నారా లోకేష్ యువతకు ఆశాకిరణంగా నిలుస్తున్నారని కొనియాడారు. ప్రజలకు ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. మహానాడు కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడంతో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రాజకీయ ఉత్సాహం నెలకొంది.

సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్

- తల్లికి వందనంతో రూ.10,090 కోట్ల ఆర్థిక సాయం
- అన్నదాత సుఖీభవ కింద 46.85 లక్షల మంది రైతులకు లబ్ధి
- మహిళల ఉచిత బస్సులో దాదాపు 63.61 కోట్ల ప్రయాణాలు
- కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

నెల్లూరు, మే 27, ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మక పసుపు పండుగమహానాడు హైబ్రిడ్ విధానంలో బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలుగుదేశం జెండాను ఆవిష్కరించి, స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, పొలిట్ బ్యూరో సభ్యులు, జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులు కూడా ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈసారి మహానాడును 1875 క్లస్టర్ల నుంచి వేలాది మంది కార్యకర్తలు హైబ్రిడ్ విధానం ద్వారా వీక్షించగా, 175 నియోజకవర్గాల నేతలు, కార్యకర్తలు ముఖ్య నాయకుల ప్రసంగాలను ఆన్‌లైన్‌లో విన్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కూటమి ప్రభుత్వ సూపర్ సిక్స్ సూపం హిట్ట్ అంశంపై మాట్లాడారు.

ప్రగతి పథంలో ఆంధ్రప్రదేశ్ ఆమె మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో ఒక సరికొత్త చరిత్రను లిఖిస్తూ, గత ఐదేళ్ల అరాచక పాలనలో, విధ్వంసకర శక్తుల చేతుల్లో నలిగిపోయిన రాష్ట్రాన్ని తన విజన్, అపర చాణక్య నీతితో మళ్లీ ప్రగతి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి పాదాభివందనాలు తెలిపారు. అలాగే ఐటీ శాఖామాత్యులు, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బాబుకి, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌కి, సహచర నేతలకు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరికీ మహానాడు శుభాకాంక్షలు తెలియజేశారు. దేశంలోనే మహిళా అభ్యుదయం కోసం తొలిసారిగా సంస్కరణలు తెచ్చిన స్వర్గీయ నందమూరి తారకరామారావుకి జోహార్లు అర్పించారు. స్త్రీశక్తి థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ మహానాడును ప్రతి క్లస్టర్ నుండి వీక్షిస్తూ, పసుపు పండుగను తమ ఇంట్లో పండగలా జరుపుకుంటున్న ప్రతి కార్యకర్తకూ ధన్యవాదాలు తెలిపారు.

హైబ్రిడ్ విధానంలో మహానాడు గత ఎన్నికల్లో 10కి 10 సీట్లు గెలిచి, తెలుగుదేశం పార్టీకి బలమైన జిల్లాగా నిరూపించుకున్న నెల్లూరులోనే ఈ మహానాడు జరగాల్సి ఉందని, కానీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పొదుపు పిలుపుతో చంద్రబాబు నాయుడు గారు తీసుకున్న నిర్ణయం మేరకు హైబ్రిడ్ విధానంలో జరుపుకుంటున్నట్లు వెల్లడించారు. నెల్లూరు గడ్డపై ఈ వేడుక జరగకపోవడం జిల్లా నాయకులకు కొంత నిరాశ కలిగించినప్పటికీ, ఈ రోజు బూత్ లెవల్ నుంచి దాదాపు 6 లక్షల మంది కార్యకర్తలు ఆన్‌లైన్‌లో పాల్గొని పండగలా జరుపుకోవడం చూస్తుంటే ఆ నిరాశ చాలా చిన్న విషయంగా అనిపిస్తోందని అన్నారు.

సూపర్ సిక్స్ సూపర్ హిట్ తెలుగుదేశం పార్టీ సూపర్ పవర్ ఈ˘సూపర్ సిక్స్ పథకాలేనని, దీనిపై ప్రత్యర్థులు అనవసర ఆరోపణలు చేశారని మండిపడ్డారు. ఈ రోజు ప్రతి పేదవాడి ఇంటికి వెళ్లి చూస్తే వారి నవ్వుల్లో సూపర్ సిక్స్ ఏ రేంజ్‌లో సక్సెస్ అయిందో తెలుస్తుందన్నారు.

తల్లికి వందనం ప్రతి విద్యార్థి తల్లికి తల్లికి వందనం్మ ద్వారా రూ.15 వేలు అందిస్తున్నామని చెప్పారు. 1 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న 67.27 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ రూ.10,090 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించామని, పేదింటి పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేశామని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో 42 లక్షల మందికే ఇస్తే, నేడు చంద్రన్న ప్రభుత్వం 67 లక్షల మందికి ఈ పథకం ద్వారా ఆపన్నహస్తం అందిస్తోందన్నారు. గత ప్రభుత్వం కుటుంబంలో ఇద్దరు బిడ్డలుంటే ఒక్కరికే పరిమితం చేసిందని,నేడు ఇంట్లో ఉన్నప్రతిబిడ్డకూతల్లికివందనం అందిస్తున్నామనిస్పష్టం చేశారు.

అన్నదాత సుఖీభవ అన్నదాత సుఖీభవ్మ పథకం ద్వారా ప్రతి రైతుకూ రూ.20 వేలు అందిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా 2025 26 ఆర్థిక సంవత్సరానికి గాను 46,85,838 మంది రైతులకు రూ.8,985 కోట్లను నేరుగా వారి ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. పెట్టుబడి సమయానికే, విత్తనాలు, ఎరువులు కొనే సమయానికే మూడు విడతల్లో ఈ సాయం అందుతోందని, ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు రెండు విడతల్లో రూ.14,000 అందడంతో వడ్డీ వ్యాపారుల దగ్గర రైతులు చేయి చాచే పరిస్థితి తప్పిందని అన్నారు.

ఉచిత బస్సు ప్రయాణం (స్త్రీ శక్తి) స్త్రీ శక్తి పథకం ద్వారా ఏపీఎస్‌ఆర్‌టీసీకి చెందిన ఐదు రకాల బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తే, మే 6వ తేదీ నాటికి ఏకంగా 63.61 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని వెల్లడించారు.

దీపం 2.0 దీపం2 పథకంతో ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా అందించి వంటింటి ఖర్చులు తగ్గించామని, రాయితీ సొమ్మును నేరుగా మహిళల అకౌంట్లలోనే జమ చేస్తున్నామని తెలిపారు.

యువగళం నిధి ఉద్యోగాల కల్పన లోకేష్ ఆశయమైన యువగళం నిధి్మ గురించి మాట్లాడుతూ.. వారసత్వం అంటే తాతల, తండ్రుల ఆస్తులు పంచుకోవడం కాదు, వారి ఆశయాలను, ఆదర్శాలను ఆచరించడమని లోకేష్ నిరూపించారన్నారు. వైకాపా పాలనలో రాష్ట్ర నలుమూలలా జరిగిన అరాచకాలను, అన్యాయాలను యువగళం పాదయాత్రలో ప్రశ్నించారని, అడుగడుగునా కనిపించిన నిరుద్యోగుల సమస్యలకి పరిష్కారంగా యువతకి 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. యువత ఉద్యోగాల కోసం రాష్ట్రం వదిలి వెళ్లకూడదని, ఉద్యోగాల కోసమే కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌కి రావాలని లోకేష్ పిలుపునిచ్చారని, ఇప్పటికే ఆయన దేశ విదేశాల్లో పర్యటించి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చారని తెలిపారు. వీటి ద్వారా 24 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రాబోతున్నాయని, ఇప్పటికే 6.28 లక్షల ఉద్యోగాలు కల్పించడం జరిగిందని స్పష్టం చేశారు.

ఆడబిడ్డ నిధి P4 పథకం మరో సూపర్ సక్సెస్ పథకమైన ఆడబిడ్డ నిధి గురించి మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడి విజన్ 2047 ద్వారా వచ్చినటువంటి P4 పథకాన్ని వైకాపా నాయకులు అపహాస్యం చేశారని, కానీ నేడు ఆ P4 పథకాల ఫలితాలు బంగారు కుటుంబాలకు బంగారు బాటలు వేస్తున్నాయని అన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం P4 ద్వారా 2 లక్షల 10 వేల బంగారు కుటుంబాల మార్గదర్శకులకు ఒక్కొక్కరికి రూ.50 వేల నుండి రూ.2 లక్షల వరకు అందించడం జరిగిందని తెలిపారు.

నెల్లూరు జిల్లాకు భారీ పెట్టుబడులు చంద్రబాబు నాయుడి నాయకత్వంలో, లోకేష్ ఆలోచనతో, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో ఇఫ్కో కిసాన్ సెజ్ (IFFCO Kisan SEZ) లో రామ్‌సే ప్రైవేట్ లిమిటెడ్, గాయత్రి రెన్యూవబుల్ ఫ్యూయల్, MBP బయో పాలిమర్, టాటా రెన్యూవబుల్ ఎనర్జీ, ఇంటర్నేషనల్ ఫ్లేవర్స్ ఫ్రాగ్నెన్సెస్ కంపెనీలు వచ్చాయని.వీటి ద్వారా నెల్లూరుజిల్లాకురూ.13వేలకోట్లపెట్టుబడులు అందాయని వివరించారు.

ప్రత్యర్థులనుద్దేశించి మాట్లాడుతూ మీరు ప్రజల డబ్బుతో ప్రచారం చేశారు, మేము ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాం. మీరు విధ్వంసం చేశారు, మేము అభివృద్ధి చేస్తున్నాం. మీరు భయాన్ని పంచారు, మేము భవిష్యత్తు ఇస్తున్నాం అని ఘాటుగా విమర్శించారు.

- రాబోయే రోజుల్లో ప్రతి ఇంటికీ అభివృద్ధి, ప్రతి యువకుడికీ అవకాశం,ప్రతి మహిళకూ గౌరవం,ప్రతి రైతుకూభరోసా అందించడమే మన లక్ష్యంమని పిలుపునిచ్చారు. ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల శ్రమ, నాయకత్వ దిశ ఉన్నంత వరకు తెలుగు దేశం జెండాను ఎవ్వరూ ఆపలేరు. చివరిగా జోహార్ అన్న ఎన్టీఆర్, జై తెలుగుదేశం, జై ఆంధ్రప్రదేశ్, జై అంటూ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తన ప్రసంగాన్ని ముగించారు.

గ్రామసభలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి

కోవూరు, మే27 ప్రభాతవార్త : కోవూరు మండలం లేగుంటపాడు గ్రామ పంచాయతీలో జిల్లా కలెక్టర్ రూపొందించిన వన్ మంత్ వన్ విలేజ్ ఫోర్ విజిట్స్ కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య మాట్లాడుతూ రైతులు తమ పొలాలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే దానిని అర్జీ రూపంలో గ్రామసభలో అందిస్తే వాటిని పూర్తిగా పరిశీలించి రైతుకు సంబంధించిన సమస్యను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు కూడా వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు నిశిత పరిశీలన చేపట్టి సకాలంలో వాటిని పరిష్కరించేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామసభలో రైతుల నుంచి 7 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు, మండల సర్వేయర్ రమేష్‌గౌడ్, వీఆర్వో నాగేశ్వరరావు, గ్రామ సర్వేయర్ నారాయణ, తదితరులు ఉన్నారు.

యూరియా వాడకంలో మెళుకువలు పాటించాలి

కోవూరు, మే27 ప్రభాతవార్త : ప్రస్తుతం వ్యవసాయం సాగు చేసే రైతులు యూరియా వాడకంలో తప్పని సరిగా మెళుకువలు పాటించాలని మండల వ్యవసాయాధికారిణి రజని అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు గ్రామ సచివాలయంలో బుధవారం యూరియా వాడకంపై వచ్చే అనర్థాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతే ఎకరానికి 3 బస్తాలు మాత్రమే యూరియా వాడుకోవాలన్నారు. ప్రస్తుతం వరి వేసిన రైతులు రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకుల దగ్గర యూరియా కార్డు తీసుకుని తద్వారా యూరియా పొందాలన్నారు. రైతులు తమ ఇష్టానుసారంగా యూరియా వాడడం వలన నేల , వాయు కాలుష్యం పెరిగిపోతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి రైతు సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులు వాడుకోవాలన్నారు. రానున్న కాలంలో వ్యవసాయానికి సంబంధించిన పథకాలు రైతు పొందాలంటే తప్పనిసరిగా 11 అంకెలు గల ఫార్మర్ విశిష్ట సంఖ్యను కలిగి ఉండాలన్నారు. దీని కోసం రైతులు రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలోగ్రామ వ్యవసాయ సహాయకులు కీర్తన, రైతులు ఉన్నారు.

లీజింగ్ కు పరిష్కారాన్ని ప్రకటించిన ఇసుజు మోటార్స్

నెల్లూరు,మే27 ప్రభాతవార్త విద్య : దేశంలో ప్రముఖ వాణిర్యు వాహన ఎగుమతుల్లో ఒకటైన ఇసుజు మోటార్స్ ఇండియా లీజింగ్ కు చక్కటి పరిష్కారాన్ని ప్రకటించటం సంతోషంగా ఉందని ఇసుజు మోటార్స్ ఇండియా ఎండి రాజేష్ మిత్తల్ పేర్కొన్నారు. బుధవారం నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు దేశంలో వివిధ వ్యాపారాలకు వాహన లీజింగ్ కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న వినియోగదారుల అభిలాషలకు అనుగుణంగా వాణిజ్య వాహనాలను పొందేందుకు సౌకర్యవంతమైన మార్గాన్ని తాము ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. వినియోగదారుల నమ్మకాన్ని నిలబెట్టుకునే తీరులో ఈ పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. అంతర్జాతీయంగా విభిన్న మార్కెట్‌లలో వ్యాపారాలకు తోడుగా నమ్మకమైన, శక్తివంతమైన ,సౌకర్యవంతమైన వాహనాలను అందించటంలో తమ సంస్థ ముందు వరుసలో ఉంటుందన్నారు. భారతదేశంలోపాటూ ప్రపంచ దేశాల్లో వాణిజ్య రంగంలో తమ సంస్థకు మంచి గుర్తింపు ఉందని గుర్తుచేశారు.ఇసుజు డి మ్యాక్స్, ఎస్‌క్యాబ్ వంటి మంచి వాహనాలను వినియోగదారులకు అందించి వారిని అభివృద్ధి బాటలో పయనించేలా చేయటమె తమ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎండి టకేషి హిరానో , సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఐలవ్‌యు బుచ్చిరెడ్డిపాళెం లైటింగ్ ఏర్పాటు

బుచ్చి మే 27 ప్రభాతవార్త : బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీలోని జొన్నవాడ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద మరియు బస్టాండ్‌లో రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నూతనంగా ఏర్పాటు చేసినటువంటి ఐలవ్‌యు బుచ్చిరెడ్డిపాళెం నేమ్‌బోర్డు ని కమీషనర్ చిన్నబాబు తో కలిసి మున్సిఫల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజామురలీ పరిశీలించారు.

కలువాయిలో అట్టహాసంగా మహానాడు వేడుకలు

కలువాయిమే 27 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ జాతీయ అద్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు పిజికల్ కలయికతో టిడిపి వినూత్న పందాలో నిర్వహిస్తున్న మహానాడు వేడుకలు మండలంలో బుధవారం అట్టహాసంగా కొనసాగాయి. రెండు రోజులు పాటు జరిగే మహానాడు వేడుకలలో క్లష్టర్ -1 పంచాయితీలకు దాచూరులో అదే విధంగా క్లష్టర్-2 పంచాయితీలకు కలువాయిలో వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ సూచనలతో పార్టీ మండల కన్వీనర్ చల్లా రఘురామిరెడ్డి ఆద్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎల్ఇడి స్క్రీన్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్ పద్దతిలో చేసిన ప్రసంగాన్ని నాయకులు కార్యకర్తలు వీక్షించారు .ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ చల్లా రఘురామిరెడ్డి,మాజీ మండల కన్వీనర్ గోనుగుంట వెంకటేశ్వర్లు నాయుడు,క్లష్టర్ 1 ఇంచార్జిలు,జి జగదల్‌నాయుడు, టి సుధాకర్‌రెడ్డి, క్లష్టర్ -2 ఇంచార్జిలు జి కిషోర్‌రెడ్డి ప్రసాద్, పీర్ల సోమయ్య, పార్టీ టౌన్ అద్యక్షులు నూటేటి నరసింహులు అన్ని గ్రామాల నాయ కులు కార్యకర్తలు పాల్గోన్నారు.

విద్యుత్‌ఘాతంలో 13 గెదులు మృతి

సీతారామపురం మే 27 ప్రభాతవార్త : సీతారామపురం మండలంలోని గంగవరం గ్రామంలో మంగళవారం సాయింత్రం వచ్చిన ఈదురు గాలులకు పొలాలలో తెగిపడిన విద్యుత్ తీగలు తగలి బుధవారం గ్రామంలోని పలువురు రైతులకు చెందిన సుమారు 13 గెదెలు మత్యవాత పడ్డాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు గంగవరం గ్రామానికి చెందిన మేడి బోయిన సుబ్బమ్మ, 3 గేదెలు మేడిబోయిన చిన్న దుగ్గయ్య 2 గేదెలు, ఆవుల కోనయ్య రెండు గేదెలు ఆవుల పది వెంకటసుబ్బయ్య ఒక్కగెదేరాగి లక్ష్మయ్య 2 గేదెలు,ఆవుల చిన్న వెంకట సుబ్బయ్య ఒక్క గేదె,ఆవుల బాలసుబ్బయ్య ఒకటి,మేడిబోయి వెంకటమ్మ ఒక్కటి వీరికి చెందిన గెదెలు పొలంతో మేత మేస్తు అటువైపుగా వెలుతున్న గెదెలు తీగిపడిన విద్యుత్ తీగలు తగలి అక్కడికి అక్కడే 13 గెదెలు మృతి చెందాయి.సుమారు 6 లక్ష ల మేరకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన పాడి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్నికి విజ్ఞ:ప్తి చేస్తున్నారు. విద్యుత్‌శాఖ ,రెవిన్యూ శాఖ,పశుసంవర్ధక శాఖ అధికారులు సిబ్బంది ఘటనా స్దలానికి చేరుకొని మృతి చెందిన గేదెలను పరిశీలించి రైతులను ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని అన్నారు.

తీర ప్రాంతంలో తీవ్ర విషాదం నాటు పడవ బోల్తా పడి నలుగురు గల్లంతు ఇద్దరి మృతదేహాలు వెలికితీత మృతి చెందిన వారు జువ్వలదిన్నె పంచాయతీ అలిచర్ల బంగారుపాలెం గ్రామానికి చెందినవారు

బిట్రగుంట మే 27 ప్రభాతవార్త : బోగోలు మండలం తాటి చెట్ల పాలెం సముద్ర తీరాన బుధవారం వేకువ జామున తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మండలం లోని జువ్వలదిన్నె అలిచర్ల బంగారుపాలెం గ్రామానికి చెందిన నలుగురు మత్స్యకారులు నాటు పడవ సహాయంతో కూర కోసం సముద్రంలో చేపలు పట్టేందుకు వెళ్లారు. అయితే ఒక్కసారిగా పెనుగాలులు వేతడంతో నాటు పడవ బోల్తా పడి నలుగురు మత్స్యకారులు గల్లంతయ్యారు. వీరిలో తుపిలి బాలమురళి(55), కొమరి గోవిందు(44)లు మృతదేహాలు పాతపాలెం వద్ద లభ్యమయ్యాయి. మరో ఇద్దరి కోసం సముద్రంలో గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టారు దీంతో ఒక్కసారిగా తీర ప్రాంత మత్స్యకార గ్రామాల్లో విషాదం చోటుచేసుకుంది బంధువుల అర్తనాధాలు సముద్ర తీరాన ఘోషించాయి.. ప్రమాదం జరిగిన వెంటనే విషయం తెలుసుకున్న బిట్రగుంట ఎస్సై రామకృష్ణ తన సిబ్బందితో వెళ్లి మృతదేహాలను వెలికి తీసి శవపరీక్ష నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు సంబంధించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే దగ్గు మాటి వెంకట్ కృష్ణారెడ్డి మహానాడు కార్యక్రమంలో ఉన్నప్పటికీ వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేసి మృతి చెందిన మత్స్య కారుడి కుటుంబానికి తక్షణ సహాయంగా ఐదు లక్షల రూపాయలు మంజూరు చేశారు. మిగిలిన వారి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు

కార్యకర్తలకు అండగా తెదేపా టిడిపి నాయకుడు పాదర్తి కోటీశ్వరరెడ్డి

కోట,మే 27 ప్రభాతవార్త : రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తూనే కార్యకర్తలకు అండగా తెదేపా ఉంటుందని సినియర్ నాయకుడు తెదేపా మాజీ కన్వీనర్ క్లస్టర్8 ఇన్ చార్జి పాదర్తి కోటీశ్వరరెడ్డి అన్నారు.కోటలోని షాదిమంజిల్‌లో క్లస్టర్ 8 పరిధిలో డిజిటల్ విధానంతో మహానాడును తెదేపా సినియర్ నాయుడు పాదర్తికోటీశ్వరరెడ్డి ఆధ్వర్యలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోటీశ్వరరెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు పార్టీ ప్రయాణం, భవిష్యత్తులో తీసుకోవాల్సి న నిర్ణయాలు ఇతర అంశాలను వర్చువల్ వేదిక ద్వారా చర్చించుకోవడం జరుగుతందన్నారు. వర్చువల్ విధానంలో మహానాడు 2026 ద్వారా లక్షల సంఖ్యలో నేతలు, కార్యకర్తలు అనుసంధాపమై ఉన్నారని పేర్కొన్నారు. దేశంలో వివిధ రాజకీయ పార్టీలు కాలగర్భంలో కలిసి పోయాన, తెదేపా ఒక్కటే నిత్య చైతన్యంతో క్రమశిక్షణ కలిగిన పార్టీగా కార్యకర్తలందరికీ అవకాశాలు కల్పిస్తుందన్నారు. అఅధికారంలోకి వచ్చిన 23 నెలల్లోనే సీఎం చంద్రబాబు నాయుడు నామినేటెడ్ పదవులూ కార్యకర్తలకు ఇచ్చారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దేలా ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ 2047 రూపొందించారన్నారు. 63 శాతం యువతకు పార్టీలో ప్రాధాన్యతకు దక్కుతోందన్నారు.26 ఏళ్లకే రామ్మోహన్ నాయుడు ఎంపీ తర్వాత కేంద్రమంత్రి అయ్యారన్నారు.గంటి హరీష్ 27 ఏళ్లకు ఎంపి అయ్యారని వివరించారు.తాను కూడా కోట మండల తెదేపా అధ్యక్షుడుగా 30 ఏళ్లకే ఎన్నికయ్యాని పేర్కొన్నారు. పార్టీ కొరకు కష్టపడ్డావారని పార్టీ మరిచిపోదన్నారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పలగాటి భాస్కర్‌రెడ్డి, ,బి రఘురామ్ నల్లపరెడ్డి జగన్‌మోహన్ రెడ్డి, షుష్మారెడ్డి, నాయకులు రమేష్, వెంకటకృష్ణయ్య గౌడ్, కె,మదుయాదవ్,జితేంద్రరెడ్డి పోక్కాలి బాలిజి, పోక్కలి సుధాకర్ శెట్టి,మాజి సర్పంచ్ పురిణి శ్రీనివాసులు, ఉచ్చూరు రవీంద్రారెడ్డి, చాపల శ్రీనివాసులు, చల్లా సురేస్, చెంగల్ రావు, వెంకట కృష్ణారెడ్డి, గోపాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో ఘనంగా మహానాడు వేడుకలు ప్రారంభం

ఆత్మకూరు (నెల్లూరు), మే 27, ప్రభాతవార్త : ఆత్మకూరు నియోజకవర్గంలో అన్ని క్లస్టర్ శ్రేణులతో రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో మహానాడు వేడుకలు బుధవారం ఆత్మకూరులోని శ్రీధర్ గార్డెన్స్‌లో ఘనంగా ప్రారంభించారు. మొదటగా ఆనం టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలసి మహానాడు వేదికకు చేరుకొని పార్టీ శ్రేణులతో కలసి తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్‌టిఆర్ విగ్రహానికి నెల్లూరు ఎంపి వేమిరెడ్డి , ఆనం కుమార్తె ఆనం కైవల్యారెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆత్మకూరులోని శ్రీధర్ గార్డెన్స్ కళ్యాణమండపంలోని ఆత్మకూరు మండల, మర్రిపాడు క్లస్టర్లకు సంబంధించిన వర్చువల్ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించగా , రవితేజ కళ్యాణమండపంలో ఆత్మకూరు పట్టణ, మర్రిపాడు మండలం కృష్ణాపురం క్లస్టర్లకు సంబంధించిన వర్చువల్ మహానాడు కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ దేశంలో నెలకొన్నవివిధ పరిణామాలకు ఇందన పొదుపు దృష్ట్యా వర్చువల్‌గా మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మన్నారు. 45సంవత్స రాల క్రితం సినీరంగంలో మకుటంలేని మహారాజుగా వెలామణి అవుతున్న నందమూరి తారక రామారావు మన రాష్ట్రంలో ఉన్న అనిశ్చిత పరిస్థితుల దృష్ట్యా తెలుగుదేశంపార్టీని స్థాపించి అశేష ప్రజాధరణతో 9నెలలకే అధికారం చేపట్టారన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకోసం నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టారన్నారు . ఆయన పార్టీని సమర్ధవంతంగా నిర్వహిస్తూనే నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నేడు విభజన ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా ప్రజలకు సమర్ధ పాలన అందిస్తూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా కొనసాగిస్తున్నారన్నారు. తెలుగుదేశం జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్‌బాబు పార్టీ పటిష్టతకు, కార్యకర్తల సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి , పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నారన్నారు. తెలుగేదేశం శ్రేణులందరూ అత్యంత ఘనంగా వర్చువల్ మహానాడును నిర్వహిస్తుండడం సంతోషకరమన్నారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యలు తెలుసుకునేందుకు మహానాడు మంచి వేదిక అని పేర్కొన్నారు. రాష్ట్ర సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి తెలుగుదేశం చేస్తున్న కృషిని , తెలుగుదేశంలో ఎన్‌టిఆర్ ఏర్పాటు చేసినఅంశాల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు ఆనం రంగమయూర్‌రెడ్డి, ఆనం కైవల్యారెడ్డి , తాళ్ళూరి గిరినాయుడు, కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, ఆరికట్ల జనార్ధన్‌నాయుడు, కంచర్ల మాధవి, కటారి రమణయ్య, తుమ్మల చంద్రారెడ్డి, తోడేటి వెంకటయ్య, కేతా విజయభాస్కర్‌రెడ్డి, సుంకర పెంచలచౌదరి, కేతా వేణుగోపాల్‌రెడ్డి, పులిమి శైలజారెడ్డి, దావా పెంచలరావు, రెండు క్లస్టర్లలోని మండల, పట్టణ, గ్రామ, క్లస్టర్, యూనిట్ స్థాయి టిడిపి ఇన్‌చార్జ్‌లు, నాయకులు , కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఏఎస్‌పేట ఎస్ఐగా జిలానీ బాధ్యతల స్వీకరణ

అనుమసముద్రంపేట,మే27,ప్రభాతవార్త: ఏఎస్‌పేట మండల నూతన ఎస్ఐగా షేక్ జిలానీ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ సైదులు నెల్లూరు నార్త్ ట్రాఫిక్ విభానికి బదిలీ కాగా ఆత్మకూరులో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న జిలానీ ఏఎస్‌పేటకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించే ముందు ఆయన స్థానిక పుణ్యక్షేత్రమైన శ్రీ ఖాజా నాయబ్ రసూల్ దర్గాలో ప్రత్యేక దర్శం చేసుకున్నారు.అనంతరం పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐకి ఘన స్వాగతం పలికారు. శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈసందర్భంగా ఎస్ఐ జిలానీ స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు సాధారణ బదిలీల్లో భాగంగా ఏఎస్‌పేట ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించానన్నారు. ప్రత్యేకంగా దర్గా ప్రాంతానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసు నిఘాను పెంచడంతోపాటు గ్రామంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు చేపడతామన్నారు.ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. గంజాయి నియంత్రణ, ఆకతాయిల ఆగడాలపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎఎస్ఐ భాస్కర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందుకూరుపేటలో కోలాహాలంగా టీడీపీ మహానాడు



ఇందుకూరుపేట, మే 27, ప్రభాతవార్త : మండల పరిధిలో తెలుగుదేశం పార్టీ మహానాడు వేడుకలు బుధవారం అత్యంత కోలాహాలంగా జరిగాయి. మండల టీడీపీ అధ్యక్షుడు ఏకొల్లు పవన్ కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో అలాగే జగదేవిపేటలో టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి పొన్నెబోయిన చెంచు కిశోర్ యాదవ్ పర్యవేక్షణలో రెండు క్లస్టర్ల పరిధిలో వర్చుల్ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా క్లస్టర్ల పరిధిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్ల ద్వారా పార్టీ శ్రేణులు, కార్యకర్తలు మహానాడు కార్యక్రమాలను ఆసక్తిగా వీక్షించారు. అంతకముందు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, టీడీపీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు(ఎన్టీఆర్) చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహానాడుకు హాజరైన కార్యకర్తలకు, అభిమానులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎంఎస్ఎంఈ డైరక్టర్ రావెళ్ల వీరేంద్ర నాయుడు స్వయంగా దగ్గరుండి భోజన సదుపాయాలు, మంచినీటి వసతిని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చాముండేశ్వరి దేవస్థానం చైర్మన్ గుండాల కృష్ణారెడ్డి, కూకటి వెంకటేశ్వర్లురెడ్డి, దాసరి విజయ్ కుమార్, కదురు చంద్రారెడ్డి, మునగాల రంగారావు, పోతురాజు హేమంత్, అవ్వారు ఏడుకొండలు, మారుబోయిన జనార్ధన్‌గౌడ్, పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉదయగిరిలో ఘనంగా మహానాడు వేడుకలు



ఉదయగిరి, మే27, ప్రభాతవార్త : మండల కేంద్రమైన ఉదయగిరిలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహానాడు వేడుకలు అత్యంత వైభవంగా ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలోని మొత్తం 10 క్లస్టర్లలో రెండు రోజుల పాటు వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమాలను నిర్వహించేందుకు విస్తృ స్థాయిలో ఏర్పాట్లు చేపట్టారు. పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని మహానాడు వేడుకలకు ప్రత్యేక ఉత్సాహన్ని తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఉదయగిరి శోభ కాంప్లెక్స్ నందు తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో(క్లస్టర్-8) అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి, పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమం మొత్తం పార్టీ పట్ల ఉన్న అభిమానం, నాయకత్వంపై విశ్వాసాన్ని ప్రతిబింబించేలా సాగింది. ఈ ఏడాది స్త్రీ శక్తి అనే ప్రధాన థీమ్‌తో నిర్వహిస్తున్న మహానాడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళా సాధికారత ,మహిళల రాజకీయ భాగస్వామ్యం, అభివృద్ధిలో వారి పాత్ర వంటి అంశాలను ప్రధానంగా చర్చిస్తూ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి హైబ్రిడ్‌మోడల్‌లో ప్రత్యక్ష ప్రసారం జరుగుతుండగా, ప్రతి క్లస్టర్‌లో ఏర్పాటు చేసి భారీ ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా కార్యకర్తలు, నాయకులు కలిసి మహానాడు కార్యక్రమాలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, యువత, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని విజయవంతం కావాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొనగా, మహానాడు వేడుకలు రాజకీయంగా ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

ప్రజల కోసం, ప్రజల పక్షాన నిలిచి పోరాడే పార్టీ కాంగ్రెస్ పార్టీ

నెల్లూరు అగ్రికల్చర్, మే27, ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను చూసి వైసీపీ భయపడుతోందని, వైఎస్ కుటుంబంపై టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని అడ్డులేకక షర్మిలమ్మపై వైసీపీ విమర్శలు చేయడాన్ని తాను పూర్తిగా ఖండిస్తున్నానని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని ఇందిరా భవన్‌లో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్రంలో వైఎస్ షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీఎక్కడ బలపడుతుందోనని వైసీపీ లేనిపోని ఆరోపణలు చేస్తుందన్నారు. వైసీపీ నేత రాచమల్లు శివప్రసాదరెడ్డి, షర్మిలమ్మ టీడీపీతో అంటకాగుతున్నారని మాట్లాడడం సమంజసం కాదన్నారు. జగన్ మెప్పు కోసం వైఎస్ షర్మిలపై నిరాధార ఆరోపణలు సరికాదని హితవు పలికారు. జగన్ గెలుపు కోసం ఆయన తల్లి విజయమ్మ చెల్లెలు వైఎస్ షర్మిల ఎంతో కృషి చేశారని అలాంటి వారిని జగన్ విస్మరించి పార్టీని బలహీనపరుచుకున్నారని వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇసుక మద్యాన్ని ఇష్టారాజ్యంగా అమ్ముకున్నారని ప్రజలకు చేసిందేమి లేదన్నారు. జగన్ ఈస్ట్ ఇండియా కంపెనీ లా ప్రభుత్వాన్ని నడపడంతో జగన్ తీరు చూసి వైఎస్సార్ ఆత్మ శోభిస్తుందన్నారు. జగన్ అరాచక పరిపాలన నచ్చకే ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారని దుయ్యబట్టారు. వైసీపీ నాయకులు సైతం జగన్ తీరుతో విసిగిపోయి వైఎస్ షర్మిల నాయకత్వం వైపు చూస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిందేమి లేదని వారి వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే వైఎస్ షర్మిలమ్మపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేకపోతుందన్నారు. కేంద్రంతో ప్రజల కోసం ప్రశ్నించలేకపోతుందన్నారు. ప్రజల కోసం ప్రజల పక్షాన నిలిచి పోరాడే పార్టీ కాంగ్రెస్ పార్టీ ఒకటేనన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు టి.బాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయాలపై వెంటనే వినియోగదారులకు సమాచారం ఉర్జా మిత్ర" ద్వారా రెక్టిఫికేషన్ సమయం మెసేజ్‌లు

నెల్లూరు, మే 27, ప్రభాతవార్త-వైద్యం : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. రాఘవేంద్రం ఈ రోజు విద్యుత్ భవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ, జిల్లాలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే విద్యుత్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు.వేసవి కాలంలో ఎన్నడూ లేనంతగా విద్యుత్ వినియోగం పెరిగిందని, ప్రస్తుతం జిల్లాలో రోజుకు సుమారు 15 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదవుతోందని పేర్కొన్నారు. భారీ విద్యుత్ వినియోగం ఉన్నప్పటికీ జిల్లాలో తగినంత విద్యుత్ అందుబాటులో ఉందని, అయితే చిన్న చిన్న సాంకేతిక అంతరాయాల వల్ల వినియోగదారులు విద్యుత్ కోతలుగా భావిస్తున్నారని తెలిపారు.విద్యుత్ అంతరాయం ఏర్పడిన వెంటనే సంబంధిత సెక్షన్ అధికారులు వినియోగదారులకు సమాచారం అందించాలని ఆదేశించారు."ఉర్జా మిత్ర" సేవల ద్వారా సంబంధిత ఫీడర్ పరిధిలోని వినియోగదారులకు రెక్టిఫికేషన్‌కు పట్టే సమయాన్ని మెసేజ్ రూపంలో పంపించాలని తెలిపారు. విద్యుత్ అంతరాయాల వివరాలను మీడియా, దినపత్రికలు మరియు సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని సూచించారు.అసిస్టెంట్ ఇంజనీర్ (తిని), డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (దీనిని), ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (నినిని)ల ఫోన్ నెంబర్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రతి విద్యుత్ అంతరాయాన్ని అత్యవసరంగా పరిగణించి, రెక్టిఫికేషన్ సమయాన్ని తగ్గించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఒక సెక్షన్‌లో పెద్ద అంతరాయం ఏర్పడితే అవసరమైతే పక్క సెక్షన్ సిబ్బందిని కూడా పంపించి వేగంగా పునరుద్ధరణ పనులు చేపట్టాలని, అవసరమైతే అదనపు గ్యాంగ్‌లను ఏర్పాటు చేసుకొని విద్యుత్ సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించాలని తెలిపారు.వినియోగదారుల సమస్యల పరిష్కారానికి విద్యుత్ భవన్‌లో 24 గంటల కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

సరికొత్త విధానంలో సాంకేతిక మహానాడు

చేజర్ల, మే27, ప్రభాతవార్త : రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది కనుల పండుగా నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ పండుగ మహానాడు సాంకేతికతతో ఓ నూతన ఒరవడితో నిర్వహిస్తున్నామని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా చేజర్ల బస్టాండ్ సెంటర్‌లోని సాయి కళ్యాణ మండపంలో బుధవారం వర్చువల్‌గా నిర్వహించిన మహానాడు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై కార్యకర్తలకు నాయకులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మహానాడు కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో లక్షలాది మంది కార్యకర్తలు ప్రత్యక్ష హాజరుతో నిర్వహించడం పరిపాటి అని అయితే ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా సాంకేతిక విధానంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొంటున్న ప్రతి కార్యకర్తకు నాయకులకు స్వాగతం పలికారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేశారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని పలు మండలాలలో మహానాడు వేడుకలు ఉత్సాహంగా జరుగుతున్నాయని తెలిపారు. గురువారం సాయంత్రం వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. పార్టీ ఆవిర్భావం నుంచి ప్రజా సేవే లక్ష్యంగా పని చేస్తోందని, అదే స్పూర్తితో నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాల్సి న బాధ్యత ప్రతి నాయకుడిపై ఉందన్నారు. గ్రామ స్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచాలని కోరారు. మహానాడు సందర్భంగా పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు, అలంకరణలతో సాయి కళ్యాణ మండపం, పరిసరాలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. నాయకుల, కార్యకర్తల నినాదాలతో సభా ప్రాంగణాన్ని మార్మోగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలు, యువ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆనం కైవల్యారెడ్డి, తాళ్లూరి గిరినాయుడు, మండల కన్వీనర్ షేక్ సిరాజుద్దిన్, రావి పెంచలరెడ్డి, అన్నలూరు శ్రీనివాసులు నాయుడు, కొమ్మి సిద్దుల నాయుడు, అచ్చాల నారాయణరెడ్డి, తలపన్నేని జయంతులు నాయుడు, బూదల్ల వీర రాఘవరెడ్డి, రావి లక్ష్మీ, నర్సా రెడ్డి, గోనుగుంట రాంబాబు, మోదేపల్లి పెంచలనాయుడు, కొమ్మి రమేష్ నాయుడు, చీర్ల వెంకటేశ్వర్లు, జువ్విగుంట బాబు, సోమవరపు హజరత్తయ్య పాల్గొన్నారు.

రేషన్ తరహాల్లో యూరియా సరఫరా

కోట, మే 27 ప్రభాతవార్త : యూరియా పక్కదారి పట్టకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోంది. అధిక డిమాండ్ ఉన్న ఈ ఎరువుల పంపిణీకి సరికొత్త విధానాన్ని ఈ నెలాఖరు నుంచి అమలు చేయనుంది. ఈ క్రమంలో రైతులకు ప్రత్యేక కార్డులను జారీ చేయనుంది. గత ఏడాది ప్రైవేటు డీలర్లు యూరియాకు కొరత సృష్టించడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. కోట సబ్ డివిజన్ పరిధిలోని వందలాది ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. దీంతో రైతులకు అవసరమైన యూరియా సమయానికి దొరక్క రైతులు కొంత ఇబ్బందులు పడ్డారు. కొంతమంది రైతులు యూరియాను దారి మళ్లించారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఎరువుల సరఫరాకు కార్డులను అందజేయాలని నిర్ణయించారు. ఎకరా వరి సాగుకు మూడు బస్తాలను మూడు విడతల్లో అందజేస్తారు. ఇతర పంటలకు కూడా నిర్దేశించిన మేరకే అందజేస్తారు. కార్డులపై సీరియల్ నంబర్ ఉంటుంది. దీన్ని ఆధార్‌కు అనుసంధానం చేస్తున్నారు. రైతు ఒక విడత యూరియా తీసుకుంటే వెంటనే మళ్లీ తీసుకోవడానికి అవకాశం ఉండదు. తద్వారా అక్రమాలకు చెక్ పెట్టే వీలుంటుంది. పిఏసిఎస్‌లు, ప్రైవేటు డీలర్లు స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు అమలవుతాయి. కార్డులో పంటల వివరాలు నమోదువతాయి. అదే సమయంలో యూరియా వాడకాన్ని తగ్గించవచ్చని వ్యవసాయాధికారులు భావిస్తున్నారు.

మహానాడుతో పసుపుమయమైన నెల్లూరు రూరల్

నెల్లూరు రూరల్ మే 27 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మక మహానాడు కార్యక్రమంతో నెల్లూరు రూరల్ నియోజకవర్గం పసుపు మయంగా మారింది. నేటి నుంచి రెండు రోజులపాటు నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమాలు నియోజక వర్గవ్యాప్తంగా ఉత్సాహభరిత వాతావ రణాన్ని సృష్టించాయి. వర్చువల్ విధానంలో భారీ స్థాయిలో చేపట్టిన ఈ కార్యక్రమాలు పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్ నింపాయి. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని మొత్తం 12 క్లస్టర్‌లలో మహానాడు కార్యక్రమాలు నిర్వహించగా, ప్రతి క్లస్టర్‌లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈసారి "స్త్రీశక్తి" థీమ్‌తో మహానాడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళా కార్యకర్తల భాగస్వామ్యం కార్యక్రమాలకు మరింత ఉత్సాహన్ని తీసుకొచ్చింది. నియోజకవర్గ పరిధిలోని క్లస్టర్-3లో జి.పి.ఆర్ కళ్యాణమండపంలో నిర్వహించిన మహానాడు కార్యక్రమంలో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మరియు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మహానాడు ప్రాంగణానికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. పసుపు జెండాలతో, పార్టీ నినాదాలతో ప్రాంగణం సందడిగా మారింది. మహానాడు విజయవంతం కావడంతో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రాజకీయ ఉత్సాహం స్పష్టంగా కనిపించింది.

విద్యుత్ షాక్ తగలి మహిళ మృతి

సీతారామపురం మే 27 ప్రభాతవార్త : సీతారామపురం మండలంలోని కోయిలం పాడు గ్రామంలో బుధవారం ఉదయం తెగిపడిన విద్యుత్ తీగలను ప్రమాదవశాత్తు తగలి మహిళ మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు మంగళవారం సాయింత్రం గాలివానకు తెగిపడిన విద్యుత్ తీగను గమనించకుండా తొక్కిన చలసాని వెంకటసుబ్బమ్మ (56) విద్యుత్ ఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందింది.ఇంటి బయట బహిర్భూమికి వెలుతుండగా ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఘటనతో గ్రామంలో విషాధ చాయలు అలముకున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి తెగిన తీగలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.సంఘటనా స్థలనాఇకి పోలీసులు చేరుకొని మృతి రాలను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మార్పింగ్ రాజకీయాలతో కావలిలో ఉద్రిక్తతలు

కావలి, మే 27 ప్రభాతవార్త : కావలిలో మార్పింగ్ రాజకీయాలు చేస్తూ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై సోషల్ మీడియాలను అయుదంగా మార్చుకుని మార్పింగ్ చేసిన ఆడియోలను వైరల్ చేస్తూ రాజకీయంగా బురదజల్లే కుట్రలు చేస్తూ కావలిలో ఉద్రిక్తలు నెలకొన్నాయని కావలి వైసిపి నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు బుధవారం కావలి డిఎస్‌పిని కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. కావలి నియోజకవర్గంలో ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాలు ప్రజాస్వామ్యాన్ని, శాంతిభద్రతలను తీవ్రంగా దెబ్బతీసే విధగా మారుతున్నాయని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేరుతో మార్పింగ్ ఆడియాలను సృష్టించి ప్రచారం చేసిన వ్యక్తులను వెంటనే గుర్తించాలని సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలతో ఉద్రిక్తతలు రెచ్చగొట్టిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే ఇల్లు ముట్టడి చేస్తామని బెదిరింపులు చేసిన వారిపై వెంటనే కేసులు నమోదు చేయాలని, కావలి ప్రాంతంలో శాంతిభద్రతలకు భంగం కలగకుండా పోలీసులు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్ష నాయకులను టార్గెట్ చేస్తూ నకిలీ ప్రచారాలతో రాజకీయకక్ష సాధింపులకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వ వైఖరిపై ప్రజల్లో మరింత ఆగ్రహం వ్యక్తమయ్యే పరిస్థితి నెలకొంటుందని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ప్రజాస్వామ్య హక్కులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రతిపక్ష నాయకులు ఇళ్ళపై దాడులు బెదిరింపులు,జరిగినచర్యలు తీసుకోకపోవడం వెనుక ఎవరి ప్రోత్సాహం ఉందో తెలిజేయాలన్నారు. మార్పిడి ముఠాలను కాపాడుతుంది ఎవరనేది ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశంగా మారిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇటుక బట్టీల వద్ద పనిచేసి వచ్చిన వారి వివరాలు సేకరణ

కావలి, మే 27 ప్రభాతవార్త : నెల్లూరు జిల్లా జడ్జి ఆదేశాల మేరకు జిల్లా లీగల్ సర్వీసెస్ ద్వారా కావలి మండల న్యాయసేవా సంస్థ సూచనల మేరకు నెల్లూరుజిల్లా దాని పరిసర మండలాల పరిధిలోని మారుమూల గ్రామాల నిరక్ష్యరాస్య గిరిజనలు, చిన్నపిల్లల చేత ఇటుక బట్టీల దగ్గర విశ్రాంతి లేకుండా పనిచేయించుకొని తక్కువ కూలి ఇచ్చిన నిరుపేద గిరిజనుల గ్రామాలలోని వారి ఇళ్ళవద్దకు బుధవారం లీగల్ ఎయిడ్ మెంబర్ ఐ.సాయిప్రసాద్, పి.యల్వి సిహెచ్ అశోక్ కలసి వివరాలు సేకరించడం జరిగింది. కావలి రూరల్ మండలం సర్వాయపాలెం గిరిజన కాలనీ, తాళ్లూరు గిరిజన కాలనీలో ఉన్న గిరిజన వివరాలు సేకరించడం జరిగింది. జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటి వారు పటిష్టంగా పనిచేసి అందరి గిరిజనుల వివరాలు సేకరించాలని ఆదేశాలు జారీ చేశారు.

ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసిన కావలి ఎమ్మెల్యే

కావలి, మే 27 ప్రభాతవార్త : బక్రీద్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులందరికి కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో బుధవారం బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు త్యాగాలకు ప్రతీక అయిన ఈద్ అల్ అదా(బక్రీద్) పండుగను ముస్లిం సోదరులందరూ భక్తిశ్రద్దలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ దేవునిపై విశ్వాసం ఉంచి సన్మార్గంలో జీవించాలని ఈద్‌అల్‌అదా తెలియజేస్తుందని తమకు ఉన్నదాంట్లో నుంచి ఇతరులకు పంచి పెట్టే దాతృత్వ స్ఫూర్తిని బక్రీద్ కలుగ చేస్తుందన్నారు. ముస్లింలందరూ ఈపండుగను సంతోషంగా నిర్వహించుకోవాలని, రాష్ట్ర కావలి నియోజకవర్గం ప్రజలపై ఆ అల్లా ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు.

టీడీపీతోనే రాష్ట్రఅభివృద్ధి సాధ్యం

గూడూరు, మే 27, ప్రభాతవార్త : టీడీపీతోనే అభివృద్ధి అని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న పీవీఆర్ ఫంక్షన్ హాల్, రూరల్ పరిధిలోని చెన్నూరు గ్రామంలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో మహానాడు కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. రెండు రోజులపాటు మహానాడును నిర్వహించనున్నారు. పార్టీ అబ్జర్వర్ గా విచ్చేసిన లక్ష్మి టిడిపి పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ అబ్జర్వర్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేసి మహానాడును ప్రారంభించారు. విజయవాడలో జరుగుతున్న మహానాడును వర్చువల్‌గా నాయకులు వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా టిడిపి కార్యకర్తలకు పండుగ రోజు అని పనిచేసే ప్రభు త్వాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని కోరారు. అనంతరం టిడిపి నాయకులు కార్యకర్తలు ఒక పండుగలాగా మహానాడును నేడు రాష్ట్ర వ్యాప్తంగా చేసుకుంటున్నారని అనేక అంశాలను చర్చించి నిర్మాణాలు చేసి కష్ట పార్టీకి పంపడం జరుగుతుందని తెలిపారు. అనంతరం గూడూరు నియోజకవర్గ పరిశీలకులు లక్ష్మి మాట్లాడుతూ మహిళలు ఆర్థిక సామాజిక రాజకీయ రంగాల్లో రాణించాలని నందమూరి తారక రామారావు టిడిపి పార్టీ స్థాపన నుండి ఎన్నో సంక్షేమ పథకాలు అందించారని ఆయన బాటలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలన సాగిస్తూ మహిళల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు శీలం కిరణ్ కుమార్, తానంకి నానాజీ, బిల్లు చెంచురామయ్య, రహీం, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, చిన్న, వైఎస్ఆర్ అల్లూరు కరుణాకర్ రెడ్డి, ఏసుపాక పెంచలయ్య, పార్టీ అనుబంధ సంఘ సభ్యులు మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఏఎస్‌పేటలో ఘనంగా మహానాడు వేడుకలు

అనుమసముద్రంపేట,మే27,ప్రభాతవార్త: మండల కేంద్రమైన ఏఎస్‌పేటలోని కామాక్షి కళ్యాణమండపంలో బుధవారం తెలుగుదేశం వర్చువల్ మహానాడు కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించగా రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొని తన ప్రసంగం ద్వారా కార్యకర్తలను ఉత్సాహపరిచారు. మండల, క్లస్టర్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో పెద్ద ఎల్ఇడి స్క్రీన్‌లు ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు, జాతీయ టిడిపి కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్‌ల ప్రసంగాలను వీక్షించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కార్యక్రమంలో పాల్గొని పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం మంత్రి వర్చువల్ కార్యక్రమంలో పాల్గొని స్క్రీన్‌మీద ప్రసంగాలను వీక్షించారు. ఈసందర్భంగా ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ నందమూరి తారకరామారావు 45సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన తెలుగుదేశంపార్టీ కార్యకర్తల బలంతో అత్యంత పటిష్టంగా ఉందని నాడు ఎన్‌టిఆర్ అధికారంలోకి వచ్చి కూడు, గుడ్డ, గూడు నినాదంతో అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌లు రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి, అన్ని వర్గాల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధతో కృషి చేయడంతోపాటు పార్టీని విజయవంతంగా నడిపిస్తూ పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం ప్రత్యేకంగా కృషి చేస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు అబ్బూరి రమేష్‌నాయుడు, కాటంరెడ్డి నర్శింహారెడ్డి, ఏలూరి మాల్యాద్రి నాయుడు, షేక్ జిలానీబాషా, నంది వివేకానందరెడ్డి , మండల , గ్రామ, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

అట్టహాసంగా మహానాడు కార్యక్రమం



అనంతసాగరం,మే27,ప్రభాతవార్త: మండల కేంద్రమైన అనంతసాగరంలోని నేషనల్ ఫంక్షన్ హాల్లో మండల టిడిపి అధ్యక్షుడు మెట్టుకూరు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో , చిలకలమర్రిలో జిల్లా పార్లమెంట్ తెలుగుదేశంపార్టీ కార్యదర్శి మునగపాటి సునీత సుబ్బరాజు ఆధ్వర్యంలో శ్రీమల్లెంకొండేశ్వరస్వామి ఆలయంలో మహానాడు మొదటిరోజు కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామాల్లో నాయకులు తెలుగుదేశంపార్టీ జెండాను ఎగురవేసి మహానాడుకు హాజరయ్యారు. ముందుగా నాయకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈకార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి హాజరయ్యారు. వర్చువల్ వీడియోను వీక్షించారు.ఈకార్యక్రమంలో ఆనం కైవల్యారెడ్డి, సోమశిల ప్రాజెక్ట్ చైర్మెన్ వేలూరు కేశవచౌదరి, తాళ్ళూరి గిరినాయుడు, మండల నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

హైబ్రిడ్ విధానంలో మహానాడులో పాల్గొన్న తెలుగు తమ్ముళ్లు

బిట్రగుంట మే 27 ప్రభాతవార్త : బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీలోని ఇబ్రహీంపేట ఎంకేఎస్ కళ్యాణ మండపంలో బుధవారం మండలానికి చెందిన8,9 క్లస్టర్లకు సంబంధించిన నేతలు కార్యకర్తలు టిడిపి తలపెట్టిన మహానాడుకు హైబ్రిడ్ విధానంలో పాల్గొన్నారు. టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు చిత్రపటానికి తొలుత పోలమాలలు వేసి కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు క్లస్టర్ ఇన్చార్జీలతో కలిసి మీరు పాల్గొని టిడిపి జాతీయ అధ్యక్షుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సందేశాన్ని ఆలకించారు.

సీతారామపురంలో అట్టహాసంగా మహానాడు

సీతారామపురం మే 27 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు జయంతిని పురస్కరించుకొని నిర్వహించే మహానాడు వేడుకను బుధవారం రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఉదయగిరి శాసనసబ్యులు కాకర్ల సురేష్ ఆదేశాలతో సీతారామపురంలోని ఎంపిడిఒ కార్యాలయం ఎదురుగా వున్న మైదానంలో మండల టిడిపినాయకులు ఘనంగా ప్రారంభించారు.ముందుగా పార్టీ స్థాపకులు ఎన్‌టిఆర్ ఆదర్శాలను స్మరించుకుంటు ఈకార్యక్రమం ప్రారంభం అయింది.డిజిటల్ స్క్రీన్ ద్వారా రాష్ట్ర పార్టీ నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమాన్ని వీక్షిస్తు పార్టీ కేంద్ర కార్యలయం చేసిన రాజకీయ తీర్మానాలు,ఆంధ్రప్రదేశ్,తెలంగాణా రాష్ట్రాల లోని రాజకీయ ఆర్థిక పరిస్థితులపై చర్చిలను ఆమోదిస్తున్న కీలక తీర్మా నాలను తిలకించారు.మండలంలోని అన్ని పంచాయితీల నుండి టిడిపి నాయకులు,కార్యకర్తలు భారీగా పాల్గోన్నారు . మహానాడు వేదికగా పలు రాజకీయ అంశాలను చర్చించారు. మహానాడుకు వచ్చే కార్యకర్తలకు బోజనం పసతి కల్పించారు. ఈకార్యక్రమంలో టిడిపినాయకులు మాజీ జడ్‌పి చైర్మన్ పొన్నుబోయిన చెంచల బాబుయాదవ్, పార్టీ కన్వీనర్ చింతల శ్రీనివాసులు, తోకల రామచంద్ర, కప్పా ప్రభాకర్ రాజు, వెంగలశెట్టి వెంకటేశ్వర్లు, ముత్తం శెట్టి చిన్నకేశ వులు, సోమన బోయిన రాజశేఖర్, కలివెల జ్యోతి, పసుపులేటి వికాస్‌బాబు, యడమ ప్రవీణ్,యడమ తిరుపతయ్య,సింగాల నాగేష్, గాజుల పల్లి చంద్రారెడ్డి , కరుణాకా ర్‌రెడ్డి, సుమన్,పిడుగు రమేష్, మాజీ సర్పంచ్‌లు బాగ్యమ్మ,ముత్తూరు వెంకటసుబ్బయ్య, మద్దినేని ఆదెయ్య, కార్యకర్తలు ,నాయకులు పాల్గోన్నారు.

జనసేన అధ్యక్షుడు, మెగా కుటుంబంపై కావలి మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండించిన జనసేన పేటేటి చంద్రనీల్

గూడూరు, మే 27, ప్రభాతవార్త : జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, మెగా స్టార్ చిరంజీవి పై నోటికి వచ్చినట్లు అసభ్యకరంగా మాట్లాడుతున్న ఆడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న నేపథ్యంలో వాటిని ఖండిస్తూ గూడూరు నియోజకవర్గ జనసేన సీనియర్ నాయకుడు పేటేటి చంద్రనీల్ పత్రిక ప్రకటన విడుదల చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీ మాటలే తుస్సనుకున్నాం.. ఇప్పుడు మీ ఆలోచనలు కూడా తుస్సేనని ప్రజలు గుర్తిస్తున్నారు. నీచ ఆలోచనలు సవరించుకోండని హెచ్చరించారు. మెగా సోదరులు, జనసేన పార్టీ, పవన్ కళ్యాణ్‌పై నోటికి వచ్చినట్లు మాట్లాడితే ప్రజలు సహించరని అన్నారు. రాజకీయాల్లో విభేదాలు ఉండొచ్చు కానీ కుటుంబాలను, వ్యక్తిగతంగా దూషించే సంస్కారం జనసేన పార్టీ ఎప్పుడూ నేర్పలేదు, కుక్క కూడా తిన్న ఇంటి విశ్వాసం మర్చిపోదు. కానీ ప్రజారాజ్యం, జనసేన పార్టీల వల్ల గుర్తింపు పొందిన కొందరు ఇప్పుడు అదే కుటుంబాన్ని అవమానించే స్థాయికి దిగజారడం దురదృష్టకరమన్నారు. గత ఐదు సంవత్సరాల వైఎస్సార్సీపీ పాలనలో కావలి ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కన్నా.. అవినీతి, భూముల దందాలు, మట్టి - గ్రావెల్ దోపిడీలే అని ఆరోపించారు.

గాలి బీభత్సం.. అంధకారంలో శంఖవరం

విజయమూరు, మే26, ప్రభాతవార్త : విజయమూరు మండలం శంఖవరం గ్రామంలో మంగళవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. కొద్దిపాటి వర్షానికి భారీ నష్టం వాటిల్లడంతో గ్రామం మంగళ, బుధ పూర్తిగా అంధకారం లోకి వెళ్ళిపోయింది. గుండెమడకల సబ్ స్టేషన్ నుండి శంఖవరం గ్రామానికి విద్యుత్ సరఫరా చేసే ప్రధాన లైన్‌లో రేకటి పొలాల మధ్య సుమారు 10 స్తంభాలు గాలుల దాటికి విరిగిపోయాయి. దీంతో పాటు గ్రామంలోని ఎల్‌టీలైన్ కు సంబంధించి రెండు స్తంభాలు పూర్తిగా విరిగిపోయాయి. మరో రెండు స్తంభాలు ఒరిగిపోయాయి. దీంతో గ్రామానికి విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. బుధవారం విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ సిబ్బంది గ్రామానికి చేరుకుని క్షేత్ర స్థాయి పరిశీలించారు. గాలి ఉధృతికి పాత స్తంభాలు తట్టుకోలేకపోయాయి. రేగడి నేలలో పునాదులు కదిలిపోవడంతో స్తంభాలు విరిగిపోయాయని తాత్కా లిక మరమ్మత్తులకు కూడా రెండు రోజులు పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. నష్టం వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదించి యుద్ధ ప్రాతిపదికన కొత్త స్తంభాలు వేసేందుకు చర్యలు చేపడతామన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామంలో వాటర్ ప్లాంట్ బోర్లు పనిచేయక పోవడంతో తాగునీటి సమస్య తీవ్రమైంది. కరెంటు లేక మోటార్లు ఆడటం లేదు. తాగేందుకు చుక్క నీరు లేకుండా పోయింది. చిన్న పిల్లల తల్లుల పరిస్థితి వృద్దుల పరిస్థితి మరి దయనీయంగా మారింది. రాత్రంతా కరెంటు లేక ఫ్యాను ఆడలేదు. దోమల బాధతో దాంతో రాత్రితో వనవాసం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామంలో నెలకొన్న పరిస్థితులను చక్కదిద్దేందుకు తెలుగుదేశం పార్టీ యువ నేత భూమిరెడ్డి నరసింహారెడ్డి, దేశం నేతలతో కలిసి గాలులకు రోడ్డుకు అడ్డంగా పడిన తాటిచెట్లను జేసీబీ సహాయంతో తొలగించారు. అలాగే గ్రామంలో పడిపోయిన వేప చెట్ల కొమ్మలను గ్రామ యువకులు కలిసి తొలగించారు. మండల స్థాయి అధికారులు గ్రామంలో నెలకొన్న ఇబ్బందులను తొలగించాలని అధికారులను వేడుకున్నారు.

మాజీ మంత్రి ప్రసన్న పరామర్శలు

కోవూరు, మే 27, ప్రభాతవార్త : మాజీ మంత్రి రాష్ట్ర వైసీపీ పిఏసి సభ్యులు నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి బుధవారం కోవూరులో పరామర్శలు చేపట్టారు శాంతినగర్ చెందిన వైసిపి జిల్లా యువజన విభాగం కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి సోదరుడు హరి రెడ్డి ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఈ మేరకు కుటు ంబ సభ్యులను ప్రసన్న కుమార్ రెడ్డి ఓదార్చి తన సానుభూతి తెలియజేశారు. ఈ సమయంలోనే గుండె దితవు చేసుకొని ధైర్యంగా ఉండాలని వారికి తెలియజేశారు. ఆయన వెంట వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ రెడ్డి, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు నరసింహులు రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అనుప్ రెడ్డి, మాజీ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హరి ప్రసాద్ రెడ్డి, జడ్పిటిసి సభ్యురాలు శ్రీలత, నేతలు జుబేర్ భాష, ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచాలి

కోవూరు, మే 27, ప్రభాతవార్త : గ్రామీణ ప్రాంత ప్రజల్లో సీజన్లో వచ్చే వ్యాధులపై మరింత వాహనం కల్పించేలా ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా టీబీ ఎయిడ్స్ క్షయ వైద్యాధికారి డాక్టర్ ఖాదర్ వలీ తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం సూపర్వైజర్లు ఆరోగ్య సిబ్బందితో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌పివి వాక్సినేషన్ పై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ వ్యాక్సినేషన్ వేసుకోవడం వల్ల ఏ విధమైన ఉపయోగాలు ఉన్నాయో వారికి పూర్తి స్థాయిలో అవగాహన పెంచాలన్నారు. అదే విధంగా ఎఫ్‌ఆర్‌ఎస్ కార్యక్రమాన్ని వైద్యాధికారులు క్రమం తప్పకుండా నిర్వహించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ సమీక్షలో ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ఇర్బాన్, డాక్టర్ నిరంజన్, సూపర్వైజర్లు ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

క్షయ వ్యాధి నివారణకు వైద్యులు పూర్తి స్థాయిలో సహకరించాలి

కోవూరు, మే 27, ప్రభాతవార్త : సేవ్ వ్యాధిని పూర్తిస్థాయిలో నివారించేందుకు వైద్యులు పూర్తి స్థాయిలో సహకరించాలని జిల్లా క్షయ ఎయిడ్స్ టీవీ నివారణ అధికారి డాక్టర్ ఖాదరవల్లి తెలిపారు. కోవూ రులోని సామాజిక ఆరోగ్యంగానే బుధవారం ఆయన ఆకస్మికంగా పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ప్రయోగశాలలో గళ్ళ పరీక్షలు ఏ విధంగా నిర్వహిస్తున్నారని తనిఖీ చేశారు. అనంతరం సామాజిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన వైద్యు లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం క్షయ నివారణగాను 100 టిబి ముక్తియార్ భారత్ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. షుగర్ వ్యాధి గ్రస్తులకు హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు తప్పనిసరిగా స్పుటం పరీక్షలో నిర్వహించాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో 231 గ్రామాలను హై రిస్క్ ఉన్న గ్రామాలుగా గుర్తించడం జరిగిందన్నారు. ఈ గ్రామాలలో 60 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి ఎక్సే పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదేవిధంగా 14 సంవత్సరం దాటిన ప్రతి ఒక్కరికి కూడా ఈ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రధానంగా గర్భవతులకు తప్పనిసరిగా హెచ్ఐవి పరీక్షలు నిర్వహించాలని వైద్యులకు సూచించారు ప్రతి రోగికి సంబంధించిన ఫోన్ నెంబర్‌ను తప్పనిసరిగా రికార్డులో నమోదు చేయాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ సలావుద్దీన్, డాక్టర్ జ్యోతి ప్రభ, డాక్టర్ మయుద్దీన్ తదితరులు ఉన్నారు.

అడ్వాన్స్‌డ్ ప్రోటీన్ షాంపుకు విశేషస్పందన

నెల్లూరు,మే27 ప్రభాతవార్త విద్య : తమ సంస్థ విడుదల చేసిన అడ్వాన్స్‌డ్ ప్రోటీన్‌షాంపుకు వినియోగదారుల నుండి విషేష స్పందన రావటం సంతోషంగా ఉందని మారికో లిమిటెడ్ కోర్‌బిజినెస్ ఇండియా సిఈఒ అశిష్ గోపాల్ పేర్కొన్నారు. బుధవారం నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రముఖ ఎఫ్‌ఎంసీజీల్లో ఒకటైన తమ మారికో లిమిటెడ్, పారాచూట్ అడ్వాన్స్‌డ్ ప్రోటీన్ షాంపును విడుదల చేయటం ద్వారా హెయిర్ క్లెన్సింగ్ విభాగంలోనికి అడుగుపెట్టడం జరిగిందన్నారు. ఈ నూతన ఉత్పాదనలో కొబ్బరి, సహజ పదార్థల గుణాలను కలిగి ఉంటుందన్నారు. ఇది కేశసంరక్షణ విభాగంలో తమ సంస్థ పేరును మరింత బలోపేతం చేయనుంది ఆశాభావం వ్యక్తంచేశారు. తమ సంస్థను మరింత బలోపేటంచేయటంలో భాగంగా ఇప్పటికే తమ సంస్థ అనేక నూతన ఉత్పాదనలనుమార్కెట్‌లోకి విడుదల చేయటం జరుగుతుందన్నారు. తమ నూతన ఉత్పాదలను మార్కెట్‌లో సహజ ఉత్పత్తులను వెతుకుతున్న వినియోగదారులకు మంచి అవకాశంగా మారిందన్నారు. తమ నూతన వస్తువులను కూడా ఇదే విదంగా ఆదరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నారాయణమ్మ నేత్రదానం

కావలి, మే 27 ప్రభాతవార్త : కావలి వైకుంఠపురం చేవూరి వారితోట నివాసి ఎం.నారాయణమ్మ వృద్దాప్య సమస్యతో తుదిశ్వాస విడిచారు. ఈ విషాద సమయంలోనూ ఆమె కుటుంబ సభ్యులు ఎంతో ధైర్యంతో, సామాజిక భాద్యతతో ముందుకు వచ్చి బుధవారం నారాయణమ్మ నేత్రాలను దానం చేసి మానవత్వాన్ని చాటుకు న్నారు. ఆ ప్రాంత వాస్తవ్యులు ఆవుల శివ అందించిన సమాచారంతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ మెంబర్ కలికి శ్రీహరిరెడ్డి, బెజవాడ ప్రసన్నకుమార్, ఇలింద్ర శ్రీవాణి ఆధ్వర్యంలో నేత్రదానం జరిగింది. కుటుంబ సభ్యుల పూర్తి సహకారంతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా సేకరించిన నేత్రాలను నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి వారికి అందజేశారు. తద్వారా ఇద్దరు అంధులకు చూపు వచ్చే అవకాశం కలిగింది. మరణంలోనూ మరొకరికి చూపునిచ్చి ఆదర్శంగా నిలిచిన నారాయణమ్మ కుటుం బసభ్యులను, ఇందుకు సహకరించిన ఆవుల శివని రెడ్‌క్రాస్ ప్రతినిధులు అభినందించారు.

హైబ్రిడ్ మహానాడుతో టీడీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం

కొడవలూరు, మే 27 ప్రభాతవార్త: 44వ మహానాడు రెండురోజుల కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు కొడవలూరు మండలంలోని 2, 7 క్లస్టర్ల పరిధిలో నార్త్ రాజుపాలెం, దామేగుంట గ్రామాల్లో ఏర్పాటు చేసిన హైబ్రిడ్ మహానాడు కార్యక్రమాన్ని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పర్యవేక్షణలో మండల పార్టీ అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్ల నాయుడు, మండల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు ముందస్తు జన్మదిన వేడుకలను నిర్వహించి కేక్

కోవూరులో మహానాడు సరికొత్త రికార్డు..

కోవూరు, మే27 ప్రభాతవార్త తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మక పసుపు పండుగ మహానాడు వేడుకల్లో భాగంగా కోవూరు నియోజకవర్గం సరికొత్త చరిత్ర సృష్టించింది. ఇంధన పొదుపు, ఖర్చుల నియంత్రణ కోసం అధిష్టానం పిలుపు మేరకు ఈ ఏడాది తొలిసారిగా ప్రవేశపెట్టిన హైబ్రిడ్ మహానాడు విధానానికి నియోజకవర్గంలో అపూర్వ స్పందన లభించింది. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి జరిగిన ఈ కార్యక్రమాన్ని వర్చువల్ (ఆన్‌లైన్) పద్ధతిలో వీక్షించేందుకు కార్యకర్తలు 11 క్లస్టర్లలో జరిగిన హైబ్రిడ్ మహానాడు కార్యక్రమానికి భారీగా తరలివచ్చారు. తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరోసభ్యులు, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి క్షేత్ర స్థాయిలో తెలుగుదేశం పార్టీ శ్రేణులకు మహానాడుపై దిశానిర్దేశం చేశా రు.. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న11 క్లస్టర్లలో ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ స్క్రీన్లు, డిజిటల్ వ్యవస్థల ద్వారా సుమారు 11 వేల మందికి పైగా తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఏకకాలంలో ఈ మహానాడులో పాల్గొన్నారు. అధినేత నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ ప్రసంగాలను ఉత్సాహంగా వీక్షించారు. ఒకే నియోజకవర్గం నుంచి ఈ స్థాయిలో వర్చువల్ విధానంలో ఇంత పెద్ద సంఖ్యలో కేడర్ పాల్గొనడం రాష్ట్రస్థాయిలోనే సరికొత్త రికార్డుగా నిలిచిందని పార్టీ వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. "సరికొత్త టెక్నాలజీతో డిజిటల్ పద్ధతిలో నిర్వహించిన ఈ మహానాడుకు కార్యకర్తల నుంచి వచ్చిన రెస్పాన్స్ అద్భుతం. 11వేల 200 మంది భాగస్వామ్యంతో కోవూరు నియోజకవర్గం రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిచింది" అని స్థానిక నేతలు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి క్లస్టర్ పసుపుతోరణాలు, ఫ్లెక్సీలతో పండుగ వాతావరణాన్నితలపించింది. మహిళా సాధికారతకు అద్దం పట్టేలా ఖీస్త్రీ శక్తిఖీ థీమ్‌తో జరిగిన ఈ వేడుకల్లో మహిళా కార్యకర్తలు కూడా భారీ సంఖ్యలో పాల్గొన్నారు. సాంకేతికతనుఅందిపుచ్చుకుంటూ ఇంతటి భారీ కార్యక్రమాన్ని విజయవంతం చేసి, రాష్ట్రస్థాయిలో రికార్డు సాధించడంతో కోవూరు టిడిపి శ్రేణుల్లో సరికొత్త జోష్ నెలకొంది.

రానున్న ఎన్నికల్లో కావలిలో టిడిపి సత్తా చాటాలి: ఎమ్మెల్యే

కావలి, మే 27 ప్రభాతవార్త : రానున్న ఎన్నికల్లో కావలి నియోజకవర్గంలో టిడిపి సత్తా చాటాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి నాయకులకు, కార్యకర్తలకు పిలుపు నివ్వడం జరిగింది. తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమం మొదటిరోజు బుధవారం కావలి నియోజకవర్గం పసుపు మయం అయ్యింది. పట్టణంలోని ప్రధాన కూడళ్ళు పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లతో కళకళలాడుతూ పండుగ వాతావరణాన్ని తలపించాయి. ఎక్కడ చూసినా టిడిపి కార్యకర్తల సందడి నెలకొంది. మహానాడు ఉత్సాహం కావలి అంతటా వెల్లివిరిసింది. కావలి పట్టణంలోని 1,2,3,4,5,6,7 వార్డులకు సంబంధించిన మహానాడు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహానాడు అనేది కేవలం పార్టీ సమావేశం మాత్రమే కాదని, టిడిపి ఆత్మను ప్రతిబింబించే మహోత్సవమని అన్నారు. ఎన్‌టిఆర్ తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం స్థాపించిన టిడిపి నేటికి ప్రజల ఆశయాల కోసం పనిచేస్తొందన్నారు. ఆయన చూపిన మార్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి టిడిపి ప్రధాన లక్ష్యమని పార్టీ కార్యకర్తల త్యాగాలు, కష్టపాటుతోనే టిడిపి ఈ స్థాయికి చేరుకుందని పేర్కొన్నారు. కార్యకర్తలే పార్టీకి వెన్నుముక అని, వారి కష్టాన్ని పార్టీ ఎప్పటికి మరచిపోదన్నారు. సిఎం చంద్రబాబునాయుడు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. కావలి నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. టిడిపి ప్రభుత్వ హాయంలోనే రాష్ట్రంఅన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ అభివృద్ధి పథంలో దూసుకెలుతోందన్నారు. మహానాడు కార్యక్రమం విజయవంతం చేయడంలో కావలి నియోజకవర్గం రాష్ట్రంలోనే ముందుంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్లు పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో ఘనంగా మహానాడు వేడుకలు

వింజమూరు, మే27, ప్రభాతవార్త ఉదయగిరి నియోజకవర్గంలోని వింజమూరులోని తెలుగుదేశంపార్టీ ప్రధాన కార్యాలయంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహానాడు వేడుకలు అత్యంత వైభవంగా ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ప్రాంగణమంతా పసుపు పండుగ శోభతో నిండిది. నియోజకవర్గంలోని మొత్తం 10 క్లస్టర్లలో రెండు రోజుల పాటు వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమాలను నిర్వహించేందుకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపట్టారు. పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని మహానాడు వేడుకలకు ప్రత్యేక ఉత్సాహాన్ని తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వింజమూరు మండలం బొమ్మరాజు చెరువు గ్రామంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి, పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమం మొత్తం పార్టీ పట్ల ఉన్న అభిమానం, నాయకత్వంపై విశ్వాసాన్ని ప్రతిబింబించేలా సాగింది. ఈ ఏడాది స్త్రీ శక్తి అనే ప్రధాన థీమ్‌తో నిర్వహిస్తున్న మహానాడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళా సాధికాత, మహిళల రాజకీయ భాగస్వామ్యం, అభివృద్ధిలో వారి పాత్ర వంటి అంశాలను ప్రధానంగా చర్చిస్తూ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి హైబ్రిడ్ మోడల్‌లో ప్రత్యక్ష ప్రసారం జరుగుతుండగా, ప్రతి క్లస్టర్‌లో ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా కార్యకర్తలు, నాయకులు కలిసి మహానాడు కార్యక్రమాలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మండల స్థాయి ప్రతినిధులు, మహిళా నాయకులు, యువత, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని మహానాడు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొనగా, మహానాడు వేడుకలు రాజకీయంగా ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

మహానాడు వర్చువల్ కార్యక్రమాలు పండుగలా నిర్వహిస్తున్నాం: సోమిరెడ్డి

తోటపల్లి గూడూరు, మే 27, ప్రభాతవార్త మండలంలోని విలుకానిపల్లి టీఎంఎస్ఆర్ కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన మహానాడు వర్చువల్ కార్యక్రమంలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ స్థాపించి 44 సంవత్సరాలు పూర్తవుతున్న ఈ సందర్భంగా దివంగత నేత నందమూరి తారక రామారావు, నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ నాయకత్వంలో పార్టీతో కలిసి కొనసాగడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1872 క్లస్టర్ల ద్వారా మహానాడు వర్చువల్ కార్యక్రమాలను పండుగ వాతావరణంలో నిర్వహించడం తెలుగుదేశం పార్టీ ప్రత్యేకత అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నామని, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో నారాలోకేష్ కీలక పాత్ర పోషిస్తున్నారని సోమిరెడ్డి తెలిపారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసే దిశగా ప్రభుత్వంకట్టుబడి ఉందని, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే పింఛన్ల చెల్లింపులో ఆంధ్రప్రదేశ్ ప్రథమస్థానంలో ఉంద న్నారు. కార్యక్రమం ప్రారంభంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. క్లస్టర్ ఇన్‌చార్జులు వీరబోయిన గంగాధర్, కోడూరు శ్రీనివాసుల రెడ్డి (చిన్న బాబిరెడ్డి), రాష్ట్ర టీడీపీ కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండల అధ్యక్షుడు కొణతం రఘు బాబు, ప్రధాన కార్యదర్శి మన్యంజితేంద్ర గౌడ్, మాగుంట రమణారెడ్డి, జాఫర్ సాహెబ్, కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీని వాసులు రెడ్డి, తోటపల్లి గూడూరు సహకార బ్యాంక్ చైర్‌పర్సన్ సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, పేడూరు సహకార బ్యాంక్ చైర్‌పర్సన్‌గూడూరు నారాయణ, గంగపట్నం సుధీర్, నాగేంద్ర, మొగలిగుంట పోతన, అనిల్ చౌదరితో పాటుగా పార్టీనేతలు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

జగన్మోహన్ రెడ్డి సమీక్షలో పాల్గొన్న కాకాణి

నెల్లూరు, మే 27, ప్రభాతవార్త-వైద్యం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న కాకాణి గోవర్ధన్ రెడ్డి సమీక్ష సమావేశము అనంతర ము కావలి మాజీశాసనసభ్యులు రామిరెడ్డిప్రతాప్ కుమార్ రెడ్డి సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్యతో కలిసి వైయస్ జగన్మోహన్ రెడ్డిని కలిసిన కాకాని గోవర్ధన్ రెడ్డి

ముస్లిం సోదర సోదరీమణులకు బక్రీద్ శుభాకాంక్షలు

నెల్లూరు ఎంపీ శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

నెల్లూరు, మే 27, ప్రభాతవార్త-వైద్యం త్యాగానికి, భక్తికి ప్రతీకగా నిలిచే బక్రీద్ (ఈద్‌ఉల్‌అధా) పవిత్ర పర్వదినం సందర్భంగా నెల్లూరు పార్ల మెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జిల్లాలోని ముస్లిం సోదర సోదరీమణులందరికీ బుధవారం తనహృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు., "ఇస్లాం మతంలో బక్రీద్ పర్వదినానికి అపారమైన ప్రాముఖ్యత ఉంది. ఈ పండుగను భక్తిశ్రద్ధలతో, ప్రత్యేక ప్రార్థనలతో అత్యంత పవిత్రంగా జరుపుకుంటారు. సర్వశక్తిమంతుడైన దేవుని పట్ల సంపూర్ణభక్తిని, త్యాగనిరతిని, పేదల పట్ల కరుణను బక్రీద్ చాటి చెబుతుంది" అని పేర్కొన్నారు. దానధర్మాలు చేస్తూ అందరితో కలిసి పంచు కోవాలనే గొప్ప సూత్రాన్ని ఈ పండుగ నొక్కి చెబుతుందని ఆయన గుర్తు చేశారు. ఈ శుభసందర్భంలో సమాజంలో అందరి పట్ల సద్భావన, సోదర భావం సేవా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆకాంక్షించారు.

పండుగ వాతావరణంలో వర్చువల్ మహానాడు

కోవూరు, మే27 ప్రభాతవార్త : కోవూరు మండలంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలోనూ, లేగుంట పాడులోని పీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లోనూ బుధవారం వర్చువల్ మహానాడు పండుగ వాతావరణంలో ప్రా రంభం అయింది. ఈ సందర్భంగా రెండు ప్రాంతాల్లో ఐటీడీపీ చాంపియన్ టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు ముందుగా రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహానాడు ప్రాంగణంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యాల యంలో దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఒక పండుగ వాతావరణంలో ఈ వర్చువల్ మహానాడు కార్యక్రమం ప్రారంభం కావడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. మంగళగిరి నుంచి పార్టీ నాయ కులు, మంత్రులు చేసే ప్రసంగాలను క్లస్టర్ ఇన్‌చార్జులు, తెలుగు తమ్ముళ్ల ఎంతో ఆనందంగా వారి మా టలను ఆలకించారన్నారు. కోవూరు నియోజకవర్గం టీడీపీ కంచుకోట అని మరోసారి తెలుగు తమ్ముళ్ల నిరూపిం చారన్నారు. ఇదేస్ఫూర్తితో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయదుందుభి మోగిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇచ్చిన సూచనలు, సలహాలను పాటిస్తూ రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలను పూర్తిస్థాయిలో విజయవంతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ శ్యామ్ సుందర్‌రెడ్డి, జొన్నవాడ దేవస్థాన చైర్మన్ అశోక్‌రెడ్డి, మాజీ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సునీల్‌రెడ్డి, నాగరాజు, పార్టీ సీనియర్ నాయకులు పెంచలయ్య, శ్రీనివాసులు నాయుడు, రాధాకృష్ణ, ఎంపీపీ టి. పార్వతి, మాజీ ఎంపీపీ ఉమా, ఆదాల శివారెడ్డి, సుబ్బానాయుడు , శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

సముద్ర విషాదంలో మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం 5లక్షలు సాయం..



కావలి, మే 27 ప్రభాతవార్త : బోగోలు మండలం, తాటిచెట్లపాలెం సముద్రతీరంలో జరిగిన విషాద ఘటన స్థానికులను కలిచివేసింది. బుధవారం తెల్లవారుజామున సముద్రవేటకు వెళ్ళిన మత్స్యకారుల తెప్ప సముద్రంలో బోల్తాపడడంతో అలిచల్ల బంగారుపాలెం గ్రామానికి చెందిన తుపిలి బాలమురళి(55) కోమారి గోవింద్(44) మృతి చెందారు. వారి మృతదేహాలు పాతపాలెం సమీప తీర ప్రాంతంలో లభ్యమయ్యాయి. మరో ఇద్దరు మత్స్యకారులు పొలిసింగారి గణేష్, పొలిసింగారి రాజా గల్లంతు కాగా వారి కోసం పోలీసులు, మత్స్యశాఖ సిబ్బంది గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. ఘటన విషయం తెలుసుకొన్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కావలి ఏరియా వైద్యశాలకు వెళ్ళి మృతుల కుటుంబసభ్యులను పరామర్శించారు. పోస్టుమార్టం నిర్వహిస్తున్న సమయంలో కుటుంబ సభ్యులతో మట్లాడి ధైర్యం చెప్పారు. ఈ ఘటన ఎంతో భాదాకరమని మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విదాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సముద్రంలో పడవ బోల్తా ఘటనలో ఇద్దరు మత్స్యకారులు మృతి చెందడం మరో ఇద్దరు గల్లంతు కావడం తీవ్ర విషాదకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు మృతి చెందిన ప్రతి మత్స్యకారుడి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.5లక్షల ఎక్స్‌గ్రే షియా అందజేస్తామని ప్రకటించారు. గల్లంతైన మత్స్యకారుల కోసం గాలింపు చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉందన్నారు. కావలి రూరల్ మండల అధ్యక్షులు ఆవుల రామక్రిష్ణ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు.. జేసీబీ ఢీ 20 మందికి గాయాలు

తృటిలో తప్పినఘోర రోడ్డు ప్రమాదం

కోవూరు, మే27 ప్రభాతవార్త : కోవూరు మండలం పడుగుపాడు సమీపంలోని టాటా షోరూమ్ వద్ద బుధవారం మధ్యాహ్నం న తృటిలో తప్పింది. పడుగుపాడు ప్రాంతంలో రోడ్డు పనులు చేస్తున్న జేసీబీని కావలి నుంచి నెల్లూరు వైపు వస్తున్న నాన్ స్టాప్ ఆర్టీసీ బస్సు అదుపు తప్పి వేగంగా జేసీబీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ కె. బాల వెంకయ్య క్యాబిన్‌లోనే ఇరుక్కుని తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు స్థానికులు ఎట్టకేలకు శ్రమించి క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీసి 108 అంబులెన్స్ ద్వారా నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై ముత్యాలరావులు సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన 12 మందిని రెంబు అంబు లెన్స్‌ల ద్వారా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరో 6 మంది ఆటోలో చికిత్స నిమిత్తం కోవూరకు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. కావలి నుంచి నెల్లూరుకు వస్తున్న ఈ బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. డ్రైవర్ నిద్రమత్తుకు గురి కావడంతో బస్సును అదుపు చేయలేక రోడ్డు పనులు చేస్తున్న జేసీబీని ఢీకొట్టడం జరిగింది. ఈ ప్రమాదం కారణంగా మినీ జాతీయ రహదారిలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి, సిబ్బందితో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టారు. మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు వేగంగా రావడం దానిని అదుపు చేయలేకపోవడంతో రోడ్డు పనులు చేస్తున్న జేసీబీని ఢీకొట్టడం జరిగిందని, దీంతో బస్సు డ్రైవర్‌కు కాలు విరిగి తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

20 మందికి గాయాలు

కోవూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సగాయపడిన వారి వివరాలు

కోవూరు, మే27 ప్రభాతవార్త :పడుగుపాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కావలి నుంచి నెల్లూరుకు ప్రయాణిస్తున్న వారిలో కావలికి చెందిన శ్రీనివాసులు, సూళ్లూరుపేటకు చెందిన శ్రీరామ్, కనిగిరికి చెందిన ఇమ్మానుయేల్, కొత్తూరుకు చెందిన రమ్యశ్రీ, వినుతశ్రీ, కావలికి చెందిన మయూరిలు కోవూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రిలో డ్రైవర్ కె. బాలఅంకయ్య, ప్రయాణికులు టి.మహేంద్ర, టి.మన్యశ్రీ, చిన్నయ్య, చికిత్స పొందుతున్నారు.

ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారు ఉన్న ప్రతి చోట మహానాడు ఘనంగా నిర్వహణ : ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

నెల్లూరు, మే 27, ప్రభాతవార్త-వైద్యం నెల్లూరు నగర నియోజకవర్గంలో 3 క్లస్టర్‌లలో జరిగిన వర్చువల్ మహానాడు కార్యక్రమంలో ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు. జెండా ఆవిష్కరణతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యకర్తలతో కలిసి మహానాడు ప్రాంగణంలో సందడి చేశారు. అనంతరం వర్చువల్ మహానాడులో పాల్గొని వీక్షించారు. అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారు ఎక్కడ ఉంటే అక్కడ మహానాడు ఘనంగా నిర్వహిస్తున్నారని ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్ పేర్కొన్నారు. మహానాడు తెలుగుదేశం పార్టీ పండుగ కాదని ప్రజల పండుగని తెలిపారు. గ్రామ, వార్డు, మండల నియోజకవర్గ స్థాయి స్థానిక సమస్యలను మీ ప్రజా ప్రతినిధులు చర్చించి కేంద్ర కార్యాలయానికి నివేదిక పంపిస్తారని తెలిపారు. ప్రభుత్వం ద్వారా పూర్తయ్యే పనులను పూర్తి చేస్తారని, చట్టాలు చేయాల్సిన సమస్యలు ఏవైనా ఉంటే అసెంబ్లీ పార్లమెంట్‌లలో చర్చించి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తల కుటుంబం మరే పార్టీకి లేదని అన్నారు. కార్యకర్తల సంక్షేమం, ఏడాది పాటు పార్టీ నిర్వహణ అంశాలపై నిర్ణయాలు తీసుకునే గొప్ప వేదిక మహానాడు అని కొనియాడారు.

మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే

కావలి, మే 27 ప్రభాతవార్త : తాడేపల్లిలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకార్యాలయంలో వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని కావలి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలవడంజరిగింది. కావలి నియోజకవర్గ ప్రస్తుత పరిస్థితులు గురించి వివరించడం జరిగింది. ఆయన వెంట మాజీ మంత్రి జిల్లా వైసిపి అధ్యక్షులు కాకాని గోవర్ధన్‌రెడ్డి, సుళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యలు కలరు.

సీఎం చంద్రబాబు అనుభవంతోనే రాష్ట్రం అభివృద్ధితో గట్టెక్కుతుంది

- టిడిపి జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్

చిల్లకూరు, మే 27, ప్రభాతవార్త చిల్లకూరులోని జాతీయ రహదారి పక్కనలో నభూతో నాభవిష్యత్ అన్నట్లుగా పసుపు మయంగా మారిపోయింది. చిల్ల కూరులోని రోషన్ ఫంక్షన్ హాల్ వద్ద ఫ్లెక్సీలు, పసు పు తోంణాలు, పసుపు జెండాలతో, ఫ్లెక్సీలతో నిండిపోయి ఒకఅద్భుతమైన పసుపు పండుగను తలపి స్తుండుగా గూడూరు శాసనసభ్యులు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశం సునీల్ కుమార్ ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసారు. అనంతరం ఎమ్మెల్యే సునీల్ కుమార్ టిడిపి జెండాను ఆవిష్కరించి స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి మహానాడు వేడుకలను 6,7 క్లస్టర్లలోని నాయకులు కార్య కర్తలు పాల్గొన్నారు. ఈ మహానాడు వేడుకలలో గూడూరు శాసన సభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీఆర్ పురుడు పోసిన టిడిపి ఈ 44 ఏళ్ల మహోన్నత మహానాడువేడుకలను, నాయకులు, కార్యకర్తలు, మహిళలు నిర్వహిస్తున్నారు. పశ్చి మాసియా యుద్ధం వల్ల ఏర్పడిన పరిస్థితుల నేపథ్యంలో ఇంధన కొరతపై భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుమేరకు, ఏపీ చంద్రబాబు నా యుడు తక్షణమే స్పందించి బాధ్యతాయుతమైన నాయకుడిగా తక్షణమే, నెల్లూరు భౌతిక మహానాడు రద్దు చేసి, వర్చువల్ గా నిర్వహించాలని అసాధారణమైన నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వం తీవ్ర సంక్షం బంలోకి నెట్టి, నిధులు దారి మళ్లించి, వ్యవస్థలన్నీ సర్వనాశనం చేస్తే, సీఎం చంద్రబాబు నాయుడు తన అపార అనుభవంతో ప్రస్తుతం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో చక్కదిద్దుతున్నారని. అదే విధంగా మంత్రి నారా లోకేష్ అలుపెరగని శ్రమతో దేశానికి తీసుకవచ్చిన వచ్చిన పెట్టుబడుల్లో ఏకంగా 25 శాతం ఆంధ్ర రాష్ట్రానికి రాబట్టి గలిగారని, పరిశ్రమలు రావడం వల్ల 15 లక్షల మందికి నిరుద్యోగులకు ఉపాధి దొరికి, రాష్ట్ర ఆర్థిక ప్రగతి స్థితి మారిందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ మహానాడు అట్టహాసంగా ప్రారంభం

తెలుగు తమ్ముళ్ల జోష్

కోట, మే 27 ప్రభాతవార్త తెలుగుదేశం పార్టీ పసుపు పండుగ మహానాడును హైబ్రిడ్ విధానంలో అట్టహాసంగా ప్రారంభమైంది. బుధవారం కోటలోని ఎఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో క్లస్టర్ 9, షాదీమంజిల్‌లో క్లస్టర్ 8 నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటాలకు నివాళి అర్పించారు. ముందుగా జిల్లా తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ మాట్లాడుతూ పశ్చిమాసియాలో యుద్ధం ప్రభావం కారణంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ సూచనలతో ఈసారి మహానాడును చంద్రబాబు సూచనలతో వర్చువల్ విధానంలో జరుపుకుంటున్నామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన హామీలను చంద్రబాబునా యుడు అమలు చేస్తున్నారని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహిళలకు వంటింటి కష్టాలు తగ్గించేందుకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు నాడు ఇచ్చారని, నేడు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా కూటమి ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఆడబిడ్డలకు ఆర్థికంగా, సామాజికంగా గౌరవిస్తున్నామన్నారు. ఎన్టీఆర్ హయాంలో మహిళలకు ఆస్తి హక్కు కల్పించారని గుర్తు చేశారు. పార్టీ పుట్టుక, ఎన్నిక ప్రభంజనం, అన్ని సంచలనాలే అని పేర్కొన్నారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకం, పార్టీ సృష్టించిన చరిత్ర నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కూడు, గూడు, నీడ లాంటి సంక్షేమ విధానాలతో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందని జలీల్ అహ్మద్ గుర్తు చేశారు. 45 ఏళ్లుగా ప్రజా సమస్యలపై టీడీపీ పోరాటం చేస్తూనే ఉందన్నారు. దాడులు, హింస, హత్యా రాజకీయాలు, అక్రమ కేసులు, వేధింపులు ఇచ్చినా ప్రజా పోరాటాలు ఆపలేదని చెప్పారు. జాతీయ జెండా దేశానికి గౌరవం, పసుపు జెండా తెలుగు వారి ఆత్మవిశ్వాసమని పేర్కొన్నారు. విజన్ పాలిటిక్స్‌కు నాంది తెలుగుదేశమే అన్నారు. దేశ రాజకీయాలకు దిక్సూచిగా నిలిచిన పార్టీ తెలుగుదేశమే అన్నారు. జాతీయ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించిన ఏకైన ప్రాంతీయ పార్టీ మనదేనని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పలగాటి భాస్కర్‌రెడ్డి, ముత్యాలమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ చిల్లకూరు దశరథరామిరెడ్డి, నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, నెల్లూరు మోహన్‌రెడ్డి, మధుయాదవ్, నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, రఘురామ్, ఉచ్చూరు రవీంద్రనాథ్‌రెడ్డి, పుచ్చలపల్లి కోటేశ్వరరెడ్డి, రమేష్, తీగల సురేష్‌బాబు, తూపిలి రాధాకృష్ణారెడ్డి, సర్వోత్త మరెడ్డి, బాలాజీ, మేకల శ్రీనివా సులు, చల్లా కృష్ణ, జితేంద్రరెడ్డి, చాపల శ్రీనివాసులు, చిన్నయ్య, చెంగల్ రావు, చల్లా సురేష్, తిరుమలశెట్టి కోటశ్వరరావు, పోలమ్మ, యు.మధు, వెంకటకృష్ణయ్య గౌడ్ పాల్గొన్నారు.